
తెలుగు భాషోద్యమ దీప్తి

శ్రీ మండలి వెంకట కృష్ణారావు



రచన

డా॥ జి.వి.పూర్ణచందు

కృష్ణాజిల్లా రచయితల సంఘం

తెలుగు భాషోద్యమ దీప్తి

శ్రీ మండలి వెంకట కృష్ణారావు

రచన

డా॥ జి.వి.పూర్ణచందు

శుశ్రుత ఆయుర్వేదిక్ హాస్పిటల్,

బకింగ్‌హమ్‌పేట హెడ్‌పోస్టాఫీసు ఎదుట,

గవర్నరు పేట,విజయవాడ- 520 002

సెల్ : 9440172642

వెల : అమూల్యం

మొదటి ప్రచురణ: 12-02-2026

డిజైనింగ్

శ్రీ గమ్య గ్రాఫిక్స్,

విజయవాడ

సెల్ : 9866755811

ముద్రణ

బృందావన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,

విజయవాడ

పబ్లిషర్

కృష్ణా జిల్లా రచయితల సంఘం

సెల్ : 9440167697, 9440172642



తెలుగు అక్షరానికి గుడి కట్టిన భాషాసహృదయుడు
శ్రీ మండలి వెంకట కృష్ణారావు

- గుత్తికొండ సుబ్బారావు

అధ్యక్షులు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం

తెలుగు జాతిని కలిపి ఉంచే ఒకే ఒక బంధం భాష. ప్రాంతీయతా భావజాలపు ఉచ్చులో చిక్కుకుని ఆవేశకావేషాలతో రగిలిపోతున్న తెలుగుజాతిని ఏకం చేయటానికి భాష ఒక్కటే తోడ్పడగలదనే నమ్మకంతో ప్రపంచ తెలుగు మహాసభలను ఏర్పాటు చేసి, రెండు రాష్ట్రాలలోని ప్రజలనే కాదు, యావత్ప్రపంచంలోని తెలుగు వారందరినీ ఒక్క తాటిమీదకు తెచ్చిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావుగారు. తెలుగు భాష అనగానే ముందుగా స్మరించుకునే పేరు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారినే!

1983 వరకూ వీలు కుదిరినప్పుడల్లా కృష్ణాజిల్లా రచయితల మహాసభలు ఏర్పాటు చేస్తూ వస్తున్న మమ్మల్ని ఒక్క క్షణం ఆపి, అవనిగడ్డకు పిలిచి, తన ఇంట ఆతిథ్యం ఇచ్చి, రచయితల సంఘటిత శక్తిని ఇలా మహాసభలకు పరిమితం చేయటం కన్నా ఒక పటిష్టమైన రచయితల సంఘంగా ఏర్పడితే ఒక నియతితో కూడిన కార్యక్రమాల సరణి ఏర్పడగలదని హితవు చెప్పారు. ఆనాటి సమావేశంలో శ్రీ యుతులు ముక్కామల నాగభూషణంగారు, నేనూ, ఈ గ్రంథ రచయిత పూర్ణచందు, శ్రీ బుద్ధప్రసాదూ ఉన్నాము.

వారి సూచన మేరకు జిల్లాలో రచయితలందరిని ఆహ్వానించి 5వ కృష్ణాజిల్లా రచయితల మహాసభలను 1983లో అవనిగడ్డ గాంధీక్షేత్రంలోనే ఏర్పాటు చేశాము. ఆ సభలలోనే అందరమూ కలిసి కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని నిర్మించాము. దాశరధి, సినారె, యం.ఆర్.అప్పారావు, కుందుర్తి ఆంజనేయులు ప్రభృతులు గౌరవ సలహాదారులుగా, శ్రీ ముక్కామల నాగభూషణం అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా, డా॥ తెన్నేటి హేమలత, శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి, డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షులుగా, బుద్ధప్రసాద్, పూర్ణచందు కార్యదర్శులుగా, ఇంకా మరికొంత మంది సాహితీ మూర్తులతో కృష్ణాజిల్లా రచయితల సంఘం తొలికార్యవర్గం ఏర్పడింది. 1983లోనే రిజిష్టర్ అయ్యింది.

2004 వరకూ వివిధ కార్యక్రమాల నిర్వహణతో పాటు అనేక గ్రంథాలు ప్రచురిస్తూ వచ్చింది కృష్ణాజిల్లా రచయితల సంఘం. కార్యవర్గంలోని పెద్దలందరూ ఒక్కొక్కరే

స్వర్గస్థులవుతూండటంతో. కార్యక్రమాలు కొంత కుంటుపడ్తున్న దశలో, శ్రీ బుద్ధప్రసాద్ చొరవతో ఆయనే గౌరవాధ్యక్షులుగా, నేను అధ్యక్షుడిగా, శ్రీపూర్ణచందు ప్రధానకార్యదర్శిగా పునర్నిర్మించాము. అప్పటి నుండి అనితరసాధ్యమైన రీతిలో అనేక జాతీయ అంతర్జాతీయ కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చిన సంగతి భాషాభిమానులందరికీ తెలిసిందే! శ్రీ మండలి వారు వ్యవస్థాపించిన కృష్ణాజిల్లా రచయితల సంఘం 6 పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించి తెలుగును ప్రపంచ తెలుగుగా తీర్చిదిద్దాలనే ఆయన ఆదర్శాన్ని నిలబెడుతూ వచ్చింది. ఈ లక్ష్యంతోనే ప్రపంచ తెలుగు రచయితల సంఘాన్ని కృష్ణాజిల్లా రచయితల సంఘమే ఏర్పాటుచేసింది.

"ప్రపంచ తెలుగు" అనే భావనకోసం శ్రీ బుద్ధప్రసాదుతో కలిసి కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘాల ద్వారా అంకితభావంతో పని చేస్తున్నాం. ఇది మండలివారి శతజయంతి సంవత్సరం. కృష్ణారావుగారిపట్ల మా అభిమానాన్ని చాటుకుంటూ అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేసి, నిర్వహిస్తూ వస్తున్నాం.

2026 జూలై 11,12 తేదీలలో తెలుగు రచయిత్రుల మహాసభలను కూడా మండలివారి స్మృతికి కానుకగా నిర్వహించనున్నాం.

మండలివారికి అత్యంత సన్నిహితులు, పెద్దలు, కవిశేఖర గురుజాడ రాఘవశర్మ గారి 125వ జయంతి కూడా ఈ సంవత్సరమే కావటం విశేషం. రాఘవశర్మగారి మనుమలు, మనుమరాండ్రు పూనుకుని వారి తాతగారి జయంత్యుత్సవాలతో పాటు మండలివారి శతజయంతి సభను కూడా కలిపి నిర్వహించాలనే ఆలోచన చేశారు. రాఘవశర్మగారి పౌత్రులు డా. గురుజాడ రాజరాజేశ్వరి, శ్రీ గురుజాడ రామకృష్ణశర్మ తమ తాతగారి పైన ఒక స్మృతి సంచికను తెస్తూ, మండలివారి జీవనరేఖలను వివరించే ఒక లఘు గ్రంథాన్ని కూడా పూర్ణచందుతో వ్రాయించి ప్రచురించటం ముదావహం.

ఈ గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ రేగుళ్ళ మల్లికార్జున రావుగారు మండలివారిని భాషోద్యమకారుడిగా చిత్రించి మాన్య ముఖ్యమంత్రివర్యులచే ఆవిష్కరింప చేసిన మండలివారి వర్ణచిత్రాన్ని ముఖచిత్రంగా ముద్రించటం ఈ పుస్తకానికి ఎంతో సొగసు చేకూర్చింది. తెలుగు భాషోద్యమానికి స్ఫూర్తి మండలి వెంకట కృష్ణారావుగారే!

ఆ మహనీయునికి నివాళులర్పిస్తూ, గ్రంథ రచయిత డా॥ జి.వి పూర్ణచందుని, ప్రచురణకర్తలైన రాఘవశర్మగారి కుటుంబాన్నీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

❋❋❋



మండలిగారి కుటుంబం

తెలుగు భాషోద్యమ దీప్తి
శ్రీ మండలి వెంకట కృష్ణారావు

– డా॥ జి.వి. పూర్ణచందు

ఆకుల పచ్చదనంతో, పూవుల పరిమళాలతో, పండ్ల మధురసాలతో విస్తరించిన కొమ్మను తెలుగులో “మండ” అంటారు.

అలాంటి తరుశాఖావిరాజిత మహావృక్షమే…మండలి వంశం. ‘మండలి’ అన్నది ఒక వ్యక్తి ఇంటిపేరు మాత్రమే కాదు; ఒక వ్యవస్థకు ప్రతిరూపం, సమాజ శ్వాసలో ప్రతిధ్వనించే జీవస్వరూపం.

వ్యక్తి జీవితం శూన్యంలోంచి పుట్టదు. అది వంశస్మృతి, చారిత్రక అనుభవం, సామాజిక బాధ్యతలతో కూడిన అంతర్వాహినిలో ప్రవహిస్తుంది. మండలి వెంకట కృష్ణారావుగారి జీవితం కూడా ఒక వ్యక్తిగత కథ కాదు…ఒక దీర్ఘ చరిత్ర కొనసాగింపు.

కాలం వ్రాసిన శాసనాలు చెరిగిపోతాయి; కానీ కాలం మోసిన ధర్మస్మృతి వంశంగా కొనసాగుతుంది. విజయనగర సామ్రాజ్యపు విస్తార భూభాగం సీమలు, నాడులు, మండలాలుగా విభజించబడ్డ రోజుల్లో, పాలన ఆ వంశానికి ఒక పదవికాదు…ఒక బాధ్యత. అది ఆ వంశపు జీవాణువుల్లోనే నాటుకున్న జీవలక్షణం.

“పాలన అంటే అధికారం కాదు. పాలన అంటే ధర్మబాధ్యత” అని ఆజన్మాంతం నమ్మినవారు మండలి వెంకట కృష్ణారావుగారు.

కొంతమంది వ్యక్తులు వ్యక్తులుగానే ఉండరు; వారే ఒక ఉద్యమంగా మారతారు. ప్రజాహితమే వారి ప్రాణవాయువు. మానవకల్యాణం కోసం రాత్రింబవళ్ళు నిరంతరం శ్రమించడమే వారి ధ్యేయం. వారి ఆలోచనల పరిధి స్వీయ కుటుంబానికి పరిమితం కాదు…సమస్త ప్రజలే వారి కుటుంబం.

“యత్ర విశ్వం భవత్యేక నీడమ్” అన్న సుభాషితార్థాన్ని కార్యరూపంలో చూపాలన్న ఆకాంక్ష తప్ప వారికి మరోధ్యాస ఉండదు.

అలాంటి విశాల మనస్కుల్లో శ్రీ మండలి ఒకరు. ఆయన ఇంటిపేరులోనే బహుళత్వం, సమైక్యతకు సంకేతం దాగి ఉంది. మండలిని నిజంగా అర్థం చేసుకోవాలంటే, మహా తుఫానుల ధాటికి చితైన తెలుగు తీరప్రాంత ప్రజల కథను, వారి పునరావాసానికి ఆయన చేసిన నిర్విరామ కృషిని తెలుసుకోవాల్సిందే.

పదవిలో ఉన్నా లేకపోయినా శ్రీ మండలి ఎప్పుడూ ఒకేలా ఉన్నారు. నడకలోనూ, వేషధారణలోనూ, మిత్రులతో వ్యవహరించే తీరులోనూ ఏమాత్రం మార్పురాని అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ఆ స్థిరత్వమే ఆయన గొప్పతనం.

"గాంధేయ సూత్రాల సారాన్ని తెలుసుకోవాలంటే మండలితో పది రోజులు ప్రయాణిస్తే చాలు. సేవే ఆయనకు తీర్థయాత్ర. శాంతస్వభావి, శాకాహారి, అందరికీ స్నేహితుడు. చిన్నా–పెద్దా, ఉన్నత–నిమ్న భేదాలు లేకుండా సమాన గౌరవంతో ప్రతి ఒక్కరినీ చూడగల మనసు ఆయనది.

యువతకు ఆయన ఉత్సాహం, జీవశక్తి ఒక దీపస్తంభం. మండలి ఎప్పుడూ అలసిపోలేదు. భోజనం చేసినా లేకపోయినా, నిద్రపోయినా లేకపోయినా, ఇంట్లో ఉన్నా బయటనున్నా...తన కర్తవ్యపథం నుంచి ఆయన ఎప్పుడూ చలించలేదు.

ప్రేమాభిమానాలకు ఆయనకు హద్దులే లేవు. మిత్రుల పట్ల అపారమైన అనురాగం. సహాయం చేయడం మాత్రమే ఎరిగినవాడు; అడగడం తెలియని మనిషి" అంటారు ఆచార్య డా॥ సి. నారాయణ రెడ్డి, మండలివారి షష్ట్యబ్దిపూర్తి సందర్భంగా!

రాయల యగంలో "మండలి" వారి పూర్వీకులు

రాయల యుగంలో "మండలి" వారి పూర్వీకులు మండలాధ్యక్షులుగా రాజ్యరమామణి వన్నెలకు ఇతోధికంగా పాటుబడ్డారు.

రాయలవారి అనంతర యుగం... విజయనగర సామ్రాజ్యపు ఆ దశ గురించిన సమగ్ర అవగాహన ఇంకా పరిమితమే! ఆ కాలంలో అమరనాయకులు ఉన్నారు; పన్నుల పేరుతో ప్రజలను పిండినవారూ ఉన్నారు. అదే సమయంలో, ప్రజలను కన్నబిడ్డల్లా లాలించిన మహా మండలేశ్వరులు కూడా ఉన్నారు.

పన్నుల భారాన్ని తొలగించి, వలసపోయిన గ్రామాలను మళ్లీ నేలమీద నిలబెట్టిన ఒక మాండలికుని వంశగాథ ఇది. వ్యక్తిగత గుణగణాలు వంశగుణగణాలుగా వాసికెక్కిన స్మృతి ఇది.

మాండలికుడు, మండలిక్కుడు, మండలీకుడు... ప్రజల మధ్య నిలబడి రాజ్యానికి అండగా నిలిచినవాడు. కులానికి పరిమితం కాని వారు; సేవలోంచి పుట్టిన అధికారులు. శాసనాలు చెరిగిపోయినా, శాశకులు నశించినా, మాండలికుల సేవాస్మృతి వంశస్మృతిగా కొనసాగింది. అదే 'మండలి' అనే శాశ్వత ప్రతిధ్వని.

ఆనాటి మాండలికులు ఏ కులానికీ పరిమితం కాలేదు. వారు అధికారం ద్వారా కాదు, సేవ ద్వారా గుర్తింపు పొందిన పాలకులు. కాలగర్భంలో శాసనాలు కలిసిపోయినా,

రాజ్యాలు కూలిపోయినా, వారి సేవా ధర్మం మాత్రం పేరుగా, వంశస్మృతిగా మిగిలింది... 'మండలి'గా.

రాయల వారి అల్లుడు అళియరామరాజు మరణానంతరం విజయనగర రాజధాని చంద్రగిరికి తరలిన సందర్భంలో, అవకాశాన్ని చూసిన డెక్కన్ సుల్తాను ఆనెగొంది పట్టణాన్ని ఆక్రమించాడు. దోచుకున్నాడు. రాజ్యాన్ని తగలబెట్టాడు.

ఆ తగలబెట్టడం కేవలం విధ్వంసం కాదు...తిరిగి కోలుకోలేని విధంగా చరిత్రనే కాల్చివేయాలన్న ఘోర సంకల్పం!

ఆనెగొందికి చేరిక

ఈ దశలో చంద్రగిరిలో తలదాచుకున్న రాజకుటుంబీకులలో కొంత ధైర్యం ఇంకా మిగిలే ఉంది. ఆ ధైర్యమే వారిని ఆనెగొంది చేరేలా చేసింది. ఆనెగొందిని వారు పునరుద్ధరించగా, ఎండిన చెట్లు మళ్లీ చిగిర్చాయి; పంటపొలాలు వికసించాయి; జనావాసాలు తిరిగి వెలసాయి. ఆనెగొంది రాజ్యం మళ్లీ ప్రాణం పోసుకుంది.

సీమలు, నాడులు, అమరకాలు, మండలాలుగా విభజించి పాలనా వ్యవస్థను నడిపినవారు అమరనాయకులు, మండలేశ్వరులు, దుర్గదండనాయకులు... వీరంతా!

మండలం అంటే విశాలమైన పాలనా ప్రాంతం; దాని పాలకుడు మండలేశ్వరుడు. ఈనాటి జిల్లా కలెక్టర్‌తో పోల్చదగిన పదవి అది. మాండలికుడు, మండలీకుడు వంటి పదాల నుంచే 'మండలి' అనే రూపాంతరం ఏర్పడింది.

చంద్రగిరి నుంచి తరలివచ్చిన వారు ఆనెగొందిలో కొంతకాలం ప్రశాంతంగా జీవించారు. అయితే చంద్రగిరికే పరిమితమై కొన ఊపిరితో ఉన్న విజయనగర సామ్రాజ్యం అక్కడ ఇంకా సుస్థిరంగా కుదురుకోలేకపోయింది.

ఆనెగొంది పాలకులు చంద్రగిరి ప్రభువులతో వివాహ సంబంధాలు కలుపుకొని సమానమైన రాజగౌరవాన్ని పొందారు. ఆ కాలానికి అది చెప్పుకోదగ్గ రాజకీయ పరిణామం. అయితే, మండలివారి పూర్వీకులు ఏ మండలానికి మాండలికులుగా ఉండేవారో నిర్దిష్టంగా తెలియదు. ఆనెగొందిపై తరువాతి కాలంలో జరిగిన దాడుల్లో పనిగట్టుకుని రికార్డులు తగలబెట్టడం ఇందుకు ప్రధాన కారణం.

ఆనెగొందిలో కష్టాలు : క్రీ.శ. 1659లో ఆనెగొందిని ఔరంగజేబు స్వాధీనం చేసుకున్నాడు. తదుపరి వంద సంవత్సరాల పాటు ఆనెగొంది పాలకులు ఢిల్లీ సామ్రాజ్యానికి సామంతులుగా కొనసాగారు. 1750లో మరాఠాలు ఆనెగొందిని జయించాక ప్రజల కష్టాలు రెట్టింపయ్యాయి.

అది పీష్వా బాజీరావు కాలం. హంపీ, ఆనెగొందిల్ని స్వాధీనం చేసుకుని 7,000 పగోడాల పన్ను విధించారు. అలాగే 78 గ్రామాలను ఆనెగొంది పాలకుల ఆధీనంలో ఉంచి, ఆ గ్రామాల నుండి 1,53,234 పగోడాల పన్నును వసూలు చేశారు.

1775లో హైదర్ అలీ ఆనెగొంది పాలకుడు తిరుమలరాయల్ని ఓడించి రాజ్యాన్ని స్వాధీనం చేసుకుని పన్నును రెట్టింపు చేశాడు. అతని పాలన అత్యంత కఠినంగా, భయంకరంగా సాగింది.

1786లో అధికారంలోకి వచ్చిన టిప్పు సుల్తాన్ మతపరమైన అసహనంతో అంతఃపురంలోని అంతఃపురం దేవాలయాల రికార్డులను తగులబెట్టించాడు. ఆనెగొంది రాజ్య వైభవానికి సంబంధించిన ఉనికినే చెరిపేయాలన్నదే అతని లక్ష్యం.

టిప్పు సుల్తాన్ ఓటమి అనంతరం రాజ్యం నిజాం చేతుల్లోకి వెళ్లింది. నిజాం ఏలుబడిలో ఆనెగొంది ప్రజల కష్టాలు తగ్గలేదు; మరింత పెరిగాయి. అధికారుల విధానాలు ప్రజలకు హానికరంగా మారిన ఈ దుష్టపాలనా కాలంలో, మాండలికులుగా ఉన్న మండలి వంశీయులు ప్రజల బాధలను గమనించి అదనపు పన్నులను తొలగించారు. వలసపోయిన గ్రామస్థులను తిరిగి రప్పించారు. ప్రజల హక్కులను కాపాడుతూ, సమాజ సంక్షేమంలో తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వహించారు.

రాజ్యాన్ని క్షోభపెట్టటమే లక్ష్యంగా వున్న పాలకులకు ప్రజాసంక్షేమ విధానాలు సహజంగానే నప్పవు. వారు ఈ మాండలికుల్ని వెంటాడి వేధించ సాగారు.

ఈ నిరంతర కష్టకాలంలో మండలి కుటుంబం తీవ్ర మనస్తాపంతో ఆనెగొందిని విడిచి ఆంధ్ర ప్రాంతానికి తరలి వచ్చింది. 1725-1750 మధ్యకాలంలో మొదట ఏలూరులో, అనంతరం దివిసీమలో ఆశ్రయం పొందిందన్నది తిరుమలరామచంద్ర గారి అభిప్రాయం.

మాండలికులు కాబట్టి 'మండలి' వంశం

ఎడ్లబండ్లకు జోడైన కాలచక్రం నెమ్మదిగా తిరుగుతూ...మెండు, మండలి, భోగాది వంశాల పయనం మొదలైంది.

బండ్లపై ఆడవాళ్లు, పిల్లలు... సముద్రతీరం చేరి, అలలతో మాటలాడుతూ, తీరం వెంబడి సాగింది వారి జీవనయాత్ర. కళ్లలో భయం కాదు...భవిష్యత్తు వెలుగు. ఇసుకలో ముద్రలైన అడుగులే దివిసీమకు దారి చూపాయి.

మెండువారు బాపట్ల తాలూకా కాజీపాలెం నేలలో తమ వేర్లు విస్తరించారు.

మండలివారు పులిగడ్డ గాలిలో తమ ఊపిరిని కలిపారు.

భోగాదివారు భావదేవరపల్లిలో కాలాన్ని ఇంటిలా చేసుకున్నారు.

ఎడ్లబండ్ల పయనం అక్కడ ఆగినా, వంశాల కథ మాత్రం దివిసీమ గాలిలో ఇప్పటికీ నెమ్మదిగా నడుస్తూనే ఉంది.

ఆరు తరాల అనంతరం జన్మించిన శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి వంశవృక్ష మూలాల్లో చినపోతినీడు, కొండయ్యగారి వేర్లు పరిశీలకులకు లభించాయి. ఆనెగొంది నుంచి దివిసీమకు తరలి వచ్చినవారిలో చినపోతినీడే ఈ వంశానికి మూలపురుషుడు. తిరుమలప్ప, కొండయ్య, అయ్యన్న, ముసలప్ప నాలుగు కొమ్మలుగా విస్తరించింది ఆ వంశవృక్షం.

వీరిలో కొండయ్యగారు దాదాపు వంద సంవత్సరాలు జీవించినవాడు. దైవభక్తి, ఉదార స్వభావం, గంభీరతతో నిలిచిన వ్యక్తి. పులిగడ్డలో వేంకటేశ్వర ఆలయం పక్కన కోనేరు త్రవ్వించి, భక్తి జలధారను ప్రవహింపజేసినవాడు. ఎర్రగా దొండపండు వలె కాంతిమంతుడై, నిర్వహణాసామర్థ్యంతో ప్రజల గౌరవం పొందినవాడు.

కొండయ్యగారి నాలుగవ కుమారుడు సుబ్బయ్యగారు బాణాకర్ర సాధనలో నిపుణుడు. ఆయన మూడవ కుమారుడు వెంకటచలం తిరుపతి యాత్రలో బందిపోట్లను ఎదుర్కొని, ఒక్కడిగానే వారిని పారద్రోలిన ధైర్యవంతుడు.

వెంకటచలం గారి పెద్ద కుమారుడు వెంకటప్పయ్య (1842-1906) దేహదారుఢ్యం కలవాడు; భారత భాగవతాదులు అభ్యసించినవాడు. భజనల్లో, ఆధ్యాత్మిక కార్యాచరణల్లో మునిగితేలినవాడు. ప్రతి మాఘమాసంలో వెంకటేశ్వర దీపారాధన, శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించినవాడు.

వెంకటప్పయ్యగారికి పులిగడ్డలో 50 ఎకరాల మెట్టభూమి ఉండేది. నదికి అవతల రేపల్లె తాలూకా గంగడిపాలెంలో 40 ఎకరాల మాగాణీ భూమిని సంపాదించాడు.

మండలి వంశీకులు ఆర్థికంగా నిలదొక్కుకున్నది ఈ వెంకటప్పయ్యగారి కాలంలోనే. కానీ, ఆ భాగ్యం ఎక్కువ కాలం నిలువలేదు. మితిమీరిన దైవకార్యాలు, దానధర్మాలతో సమకూర్చుకున్న ఆస్తులన్నీ కాలక్రమంలో కరిగిపోయాయి.

తండ్రి వెంకట్రామయ్యగారు

వెంకటప్పయ్య...కృష్ణవేణమ్మ దంపతులకు ఐదుగురు సంతానం: వెంకటచలం, కుటుంబం, వెంకట్రామయ్య, సత్యనారాయణమూర్తి, కుటుంబరావు. వీరిలో మూడవ కుమారుడు వెంకట్రామయ్య (1890-1969) ఆదర్శ ఉపాధ్యాయుడు, నిబద్ధ జాతీయతావాది, నిజాయితీకి ప్రతిరూపం.

వెంకట్రామయ్యగారు పొడగరి, దేహదారుఢ్యం కలవారు. సంస్కృతాంధ్ర భాషలపై ప్రావీణ్యం, ప్రజాసమస్యల పట్ల సహజమైన ఆసక్తి ఆయన లక్షణాలు. జాతీయ ఉద్యమం

పట్ల సహజ చైతన్యంతో, పట్టుదలతో పనిచేసిన వ్యక్తి. కుటుంబంలోని కష్టాలు ఆయన ధ్యేయాలకు ఎప్పుడూ అడ్డుకాలేదు.

భావదేవరపల్లిలో ప్రజల సహకారంతో రామాలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. బంజరు భూములను సాగుచేసుకునేందుకు రైతులకు సహాయం అందించేవారు. అవసరమైతే తన సొంత డబ్బుతోనూ తోడ్పడేవారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే మూడవ ఫారం పూర్తి చేసి, హైయర్ గ్రేడ్‌కు చేరారు.

జిల్లాబోర్డు అధ్యక్షుడిగా ఉన్న చల్లపల్లి రాజా జీతం పెంచకుండా వేధించడంతో దావా వేసి న్యాయంగా విజయం సాధించారు. అయితే చల్లపల్లి రాజా తన పలుకుబడితో ఆ తీర్పును రద్దు చేయించటం ఒక విషాద పరిణామం. అయినప్పటికీ ప్రజలు ఆయనను "ఉపాధ్యాయ పితామహుడు"గా గౌరవించారు.

1924లో భావదేవరపల్లిలో సహకార పరపతి సంఘాన్ని స్థాపించి, 1933 వరకూ కార్యదర్శిగా ఉచిత సేవలు అందించారు. 1948లో భావదేవరపల్లిని పంచాయితీగా ఏర్పాటు చేయటంలో కీలక పాత్ర పోషించి, తొలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడు పర్యాయాలు అధ్యక్షులుగా కొనసాగుతూ వంతెనలు, రోడ్లు, మంచినీటి బావులు, పాఠశాల భవనాలు సాధించారు. మిడిల్ స్కూలు, పశువుల ఆసుపత్రి స్థాపనకు కృషి చేశారు.

పులిగడ్డ నుంచి భద్రాచలానికి ప్రతి సంవత్సరం భజన చేసుకుంటూ నడిచి వెళ్లేవారన్నది ప్రజల్లో ఉన్న నమ్మకం.

1947లో మాజీ సైనికులకు బంజరు భూములు పంచిపెట్టాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు, దాన్ని ఆపటానికి మద్రాసు ప్రభుత్వంతో పోరాడాల్సి వచ్చింది.

ఈ ఉద్యమంలో యువకుడైన మండలి వెంకట కృష్ణారావుగారు పాల్గొని విజయం సాధించారు. అదే ఆయన రాజకీయ రంగప్రవేశానికి నాందీవాక్యమైంది.

విద్యారంగంలో వెంకట్రామయ్యగారి సేవ అపారమైనది. మొదట పులిగడ్డలో 40 మంది విద్యార్థులతో వీధి పాఠశాలను ప్రారంభించారు. ఈ వీధి పాఠశాలలు 1905 నుంచి 1918 వరకు కొనసాగాయి.

ఉపాధ్యాయులకు జీతాలు తక్కువగా ఉన్నా, విద్యార్థులకు సంపూర్ణ జ్ఞానం అందించడంలో ఎక్కడా రాజీపడలేదాయన.

1913-1915 మధ్య గుంటూరు లోయర్ గుడ్ మైనింగ్ పాఠశాలలో, 1915-1921 వరకు దివి తాలూకా పాఠశాలల్లో, 1931-1938 వరకు భావదేవరపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1937 నుంచి 1947 వరకు భావదేవరపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించారు.

ఆలోచనాత్మక బోధన, ప్రాయోగిక ఉపకరణాల వినియోగం, దేశ భూభాగాలు, కొండలు, నదులు, దేవాలయాల వివరాలను ప్రత్యక్షంగా చూపిస్తూ బోధించడం ఆయన ప్రత్యేకత. ఆయన వద్ద చదువుకున్న అనేక మంది విద్యార్థులు తరువాత దేశనాయకులుగా ఎదిగారు. కమ్యూనిస్టు నాయకుడు చంద్ర రాజేశ్వరరావుగారు కూడా ఆయన శిష్యుడే.

చిన్ననాటి నుంచే ప్రజాహిత కార్యాలపై ఆసక్తి చూపిన వెంకట్రామయ్యగారు, 1924లో స్థాపించిన భావదేవరపల్లి సహకార పరిషత్‌కు 1988 వరకూ కార్యదర్శిగా ఉచితంగా సేవలందించి సహకార ఉద్యమ వ్యాప్తికి దోహదపడ్డారు.

"ఉన్నత పాఠశాల స్థాపన, దాని భవన నిర్మాణం, రామాలయ నిర్మాణాన్ని పూర్తి చేయటం, సెకండరీ గ్రేడ్ పాసైన ఒక పేదవానికి ఉద్యోగం కల్పించటం"...ఇవే ఆయన అంతిమ కోర్కెలు.

వెంకట్రామయ్యగారికి రెండు వివాహాలు జరిగాయి. మొదటి భార్య: భాగ్యవతి. రెండవ భార్య: మహంకాళమ్మ.

వారికి ముగ్గురు కుమారులు వెంకట కృష్ణారావు, నీలాంబరరావు, జనార్దనరావు; ఇద్దరు కుమార్తెలు...బంగారమ్మ, రామారత్నం.

జననం - విద్యాభ్యాసం

పల్లెవాడ గ్రామపు మట్టిలో మొలిచిన ఒక దీపస్తంభం శ్రీ మండలి వెంకట కృష్ణారావు.


సామాన్య కుటుంబ నేపథ్యంతో ప్రారంభమైన ఆయన జీవనయానం, తండ్రి వెంకట్రామయ్యగారి సంస్కారాలు, వంశప్రతిష్ఠ, కుటుంబ విలువలు...అన్నీ కలిసి ఆయన వ్యక్తిత్వానికి బలమైన పునాదులయ్యాయి.

కైకలూరు-ఆకివీడు మధ్యన నిలిచిన పల్లెవాడ... దివిసీమ గాంధీగా ప్రజల మన్ననలు పొందిన ఒక మహనీయునికి జన్మనిచ్చిన పవిత్ర గడ్డ.

దివిసీమలోని భావదేవరపల్లి ఉపాధ్యాయ కుటుంబ వాతావరణంలో ఆయన బాల్యం వికసించింది. పల్లెవాడ, భావదేవరపల్లి పాఠశాలల్లో ప్రాథమిక విద్య పూర్తిచేసి, అవనిగడ్డ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు మండలి వెంకట కృష్ణారావుగారు.

1945లో ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అయితే కళాశాల చదువు సాగుతున్న రోజుల్లోనే ఆయన మనసు సేవారంగం వైపు మళ్లింది.

కేవలం పదిహేనేళ్ల వయసులోనే... 1941లో గాంధీజీ బోధనలు ఆయన హృదయంలో దీపంలా వెలిగాయి. జాతీయ భావాలు ఆయన అంతరంగంలో వేళ్లూనుకుని, భవిష్యత్‌లో ఆయన రాజకీయ జీవితానికి దృఢమైన శ్రీకారం చుట్టాయి.



పల్లెవాడలో మండలివారు జన్మించిన ఇల్లు ఈ నాటికి స్థిరంగా అలాగే ఉంది. ఆ ఇంటిని సందర్శించిన ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డా॥ జి.వి. పూర్ణచందు.


నిత్యస్మరణీయులైన తన తల్లిదండ్రుల పేర్ల నుంచే
“వేంకట” ఒక దీపంగా, “కృష్ణ” ఒక ప్రవాహంగా...
ఆ రెండు శబ్దాలను ముడివేసి, మండలి వెంకట కృష్ణారావని నామకరణం చేసి,
“ఆత్మావై పుత్రనామాసి – సజీవశరదః శతమ్”
అంటూ, కుమారుని శిరసుపై అక్షతలు ఉంచి మాడుని వాసన చూసి, ఆశీర్వదించారు వెంకట్రామయ్యగారు.

అలా వేంకట కృష్ణారావు అనే పేరులోనే ఒక ఆశీర్వచనాన్ని లిఖించిన వెంకట్రామయ్య గారు, విశ్వనాథవారి మాటల్ని స్మరింపజేస్తూ... కృష్ణయొడ్డు జాతీయుడిగా, కృష్ణారావుగా తెలుగు తల్లి మనసును రంజింపజేసిన వ్యక్తిని ఈ భూమికి అర్పించారు.

వెంకటప్పయ్యగారు స్వర్గస్థులైన తరువాత, పులిగడ్డ గడప దాటవలసి వచ్చింది వెంకట్రామయ్యగారికి. కుటుంబ ఆర్థిక పరిస్థితులే ఇందుకు మూలకారణం.

నలుగురు కుమారులలో పెద్దవారైన వెంకటాచలం గారు అత్తగారి ఊరైన భావదేవరపల్లిని నివాసంగా చేసుకున్నారు. అన్నగారి అడుగుజాడలోనే వెంకట్రామయ్య గారు కూడా భావదేవరపల్లి చేరి, అక్షరాలకు జీవం పోసే ఉపాధ్యాయ వృత్తిలో తన జీవితాన్ని స్థిరపరచుకున్నారు.

మండలివారి వంశవృక్షం


చినపోతినీడు
తిరుమలప్ప
కొండయ్య
అయ్యన్న
ముసలప్ప
చలమయ్య
రాజన్న
నరసన్న
సుబ్బయ్య
చినరాజన్న
హనుమయ్య
నాగన్న
వెంకటాద్రి
నల్లస్వామి
శీతయ్య
వెంకటాచలం
కొండయ్య
సోమమ్మ
మహాలక్ష్మి
అలివేలమ్మ
వెంకటప్పయ్య
(కృష్ణవేణమ్మ)
సోమయ్య
దుర్గమ్మ
వీరమ్మ
లక్ష్మమ్మ
వెంకటాచలం
కుటుంబం
వెంకట్రామయ్య
(భాగ్యవతి, మహంకాళమ్మ)
సత్యనారాయణమూర్తి
కుటుంబరావు
కృష్ణవేణమ్మ
వెంకటకృష్ణారావు
(ప్రభావతి)
నీలాంబరరావు
జనార్దనరావు
బంగారమ్మ
రామారత్నం
బుద్ధప్రసాద్
విజయలక్ష్మి
అన్నపూర్ణ
డా॥ పద్యాల చంద్రశేఖర్
సత్యప్రసాద్
వాణిశ్రీ
రేవతి
డా॥ ఎమ్.ఎస్.వి.బి.
కోటేశ్వరరావు
కృష్ణప్రభ
అవనిజ
వెంకట్రామ్
ఉజ్వల
ఫణి సాయికృష్ణ
హేమకీర్తి
సింధూరి

విద్యాభ్యాసం



కృష్ణాజిల్లా దివిసీమ భావదేవరపల్లిలో అక్షరాల తొలి మెట్టు ఎక్కిన తరువాత, ఉన్నత పాఠశాల చదువుల కోసం కృష్ణారావుగారు అవనిగడ్డ గడప తొక్కవలసి వచ్చింది. పెద్దతండ్రి కుమారుడూ, అన్నయైన కుటుంబరావుతో కలిసి ప్రతిరోజూ ఎనిమిది మైళ్ళ దూరాన్ని చదువుకోసం దాటారు.

తెల్లవారుజామున నడక... చదువు కోసం అవనిగడ్డకు ప్రయాణం...సాయంత్రానికి మళ్లీ భావదేవరపల్లికి తిరుగు ప్రయాణం.

ఆ రోజుల్లో చదువు ఆయనకు శ్రమ కాదు; శ్రమలో దాగిన మాధుర్యాన్ని అనుభవించే సాధనగా మారింది.

మరికొంతకాలం అవనిగడ్డలోనే ఒక గది తీసుకుని అన్నదమ్ములిద్దరూ చదివారు. ఇంటినుంచి తెచ్చుకున్న బియ్యంతో ఆ చిన్నారి చేతులే పొయ్యి వెలిగించాయి.

బియ్యం అయిపోయిన రోజుల్లో జేబులో డబ్బులేక, పస్తులే భోజనమై, నిశ్శబ్దమే తోడుగా గడిచిన సందర్భాలూ ఉన్నాయి.

ఆ ఆకలిలోనే... తిండిలేని జీవితం ఎంత దయనీయమో, నిరుపేదల బాధ ఎంత లోతైనదో, ఆ లేత వయసులోనే పుస్తకాలకంటే ముందే, జీవిత పాఠాలుగా కృష్ణారావుగారు నేర్చుకున్నారు.

రాజకీయంలోకి తొలి అడుగులు

కృష్ణారావుగారి తండ్రి వెంకట్రామయ్యగారి కాలానికి గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలు, రాజకీయ పోరాటాలు అనేక మంది విద్యార్థులను, విద్యావంతులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆ ప్రభావంతో కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరగా, కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులైనవారు ఫెడరేషన్‌లో పనిచేశారు. హిందూ మహాసభ కార్యక్రమాల ప్రభావంతో మరికొందరు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘంలో చురుకుగా పాల్గొన్నారు.

వెంకట్రామయ్యగారు మహాత్ముని అనుయాయి. జాతి విముక్తికి ప్రతి ఒక్కరూ తన వంతు బాధ్యత నిర్వర్తించాలనే విశ్వాసం కలిగిన వ్యక్తి. గాంధేయ మార్గంలో ప్రజాసమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ ఆయన సేవానిరతిని కొనసాగించారు.

అప్పటికి పదహారేళ్ల వయసు కూడా పూర్తిగా రాని కృష్ణారావుగారు, ఆవేశపూరిత ఉద్యమాల ప్రభావాలకు లోనుకాక, అహింసా సిద్ధాంతాన్ని ఆచరించిన గాంధీజీ మార్గాన్నే ఎంచుకున్నారు. తండ్రి ప్రభావం కావచ్చు, గాంధేయ భావజాలానికి ఆకర్షితుడై కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ప్రారంభించారు.

1941 వ్యక్తి సత్యాగ్రహం, 1942 క్విట్ ఇండియా...ఈ రెండు ఉద్యమాల అగ్నిపథాలపై నడిచిన యువకుడు శ్రీ కృష్ణారావు. దివిసీమ నేలపై ఆ ఉద్యమాలకు ఆయన ప్రాణప్రతిష్ఠ చేశారు. మాటకన్నా ముందే అడుగు, ఆలోచనకన్నా ముందే ఆచరణ... అదే ఆయన స్వభావం. చిరువోలు రాధాకృష్ణమూర్తిగారు, ఏలేశ్వరపు కృష్ణమూర్తిగారు, వేమూరి నారాయణమూర్తిగారు నడిపిన వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమ సంఘటనలు ఆయన మనసును మరింత మేల్కొలిపాయి.

క్విట్ ఇండియా ఉద్యమపు ఉప్పెన రోజుల్లో ప్రభుత్వ దమననీతికి ఎదురుగా నిలిచారు కృష్ణారావుగారు. అప్పటికి ఆయన ఫిఫ్త్ ఫారం చదువుతున్నారు. సహవిద్యార్థులందరినీ సమ్మె బాట పట్టించారు. గోడలపై పోస్టర్లు అంటించడం, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండా ఆవిష్కరించడం...ఆ రోజుల్లో పోలీసుల దృష్టిలో ఇవన్నీ 'దుందుడుకు చర్యలే'.

అవనిగడ్డ హైస్కూలుపై జాతీయ జెండా ఎగరేయడానికి గోడదూకారు ఆయన. పక్కనున్న సహవిద్యార్థులు 'పాములు తిరుగుతాయి' అని హెచ్చరించినా వినలేదు. పాక్కుంటూ హైస్కూలు భవనం పైకెక్కి జాతీయ పతాకాన్ని ఎగరేశారు. ఊరి జనాన్ని ఆశ్చర్యచకితులను చేశారు. స్వాతంత్ర్య స్వప్నం పొంగింది; జాతీయ పతాకం ప్రతి మస్తకంపై గర్వంగా ఎగిరింది.

జాతీయ విద్యార్థి సంఘ సభ్యుడిగా సాగుతూ, అవనిగడ్డ శాఖాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఆయన చేసిన కృషి అపారం. ఉన్నత పాఠశాల విద్యార్థిగానే ఆయన రాజకీయ జీవితం అంకురించింది...ఆ అంకురమే తరువాత ఒక వటవృక్షమైంది.

శాఖాధ్యక్షుడిగా ఒక చేతితో విద్యార్థులకు చదువుకు అవసరమైన సదుపాయాలు సమకూర్చుతూ, మరో చేతితో జాతీయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ తన సవ్యసాచిత్వాన్ని నిరూపించారు మండలివారు. అవనిగడ్డ హైస్కూలులో ప్రతి గురువారం జరిగే చర్చా సదస్సులు జ్ఞానదీపాల్లా వెలిగేవి. ఆ సభలకు విద్యార్థులే కాదు... ఉపాధ్యాయులు, పురప్రముఖులూ ఆకర్షితులయ్యేవారు.

ఆ చర్చల్లో పదాలు కాదు...ఆలోచనలు నడిచేవి; వాదనలు కాదు...విజ్ఞానం వికసించేది.

అలా విద్యతో ఉద్యమం, ఉద్యమంతో జీవితం ఒక్కటై గడిచిన రోజులవి..

మూర్తీభవించిన గాంధీయవాదం

శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి పేరు వినగానే ఎవరి మనసులోనైనా స్ఫురించేవి... గాంధేయ సిద్ధాంతాలు, నిశ్శబ్దమైన సమాజసేవ, నిరాడంబర జీవన విధానం. ఈ మూడు ధారలు కలిసిన త్రివేణీ సంగమంలా ఆయన జీవితం నిరంతరం ప్రజాశ్రేయస్సు వైపు ప్రవహించింది.

మనసా–వాచా–కర్మణా గాంధీమార్గాన్ని అనుసరించిన నిజమైన అనుయాయి ఆయన. నిజాయితీ, చిత్తశుద్ధి...ఈ రెండు గుణాలు ఆయనకు అలంకారాలు కాదు; అవే ఆయన స్వభావం. రాజకీయంగా ఆయనకు వ్యతిరేకులైనవారు కూడా ఈ పరమ సత్యాన్ని అంగీకరించక తప్పలేదు. మంత్రి పదవీ స్వీకారం చేసిన వెంటనే తన ఆస్తుల వివరాలను ప్రజల ముందుంచి, అవినీతికి తావులేని పాలనకు పునాది వేశారు.

వినయం ఆయనలో సహజసిద్ధం. భేషజాలకు దూరంగా ఉండాలనే సంకల్పంతో పూలదండలు స్వీకరించబోనని ప్రకటించి, ఎంతటి ఒత్తిడి వచ్చినా ఆ ఆశయానికి కట్టుబడి నిలిచారు.

ఆయన నిరాడంబరతకు పరాకాష్ఠగా నిలిచింది... బస్సు ప్రయాణం. అది లాంఛనంగా కాదు; వీలైన ప్రతిసారీ, రాష్ట్రంలో ప్రయాణాలకూ బస్సులనే ఎంచుకున్న ఆదర్శమూర్తి ఆయన.

పాలనా బాధ్యతలు వహించేవారికి ప్రజలతో సాన్నిహిత్యం అవసరమని, అదే అవినాభావ సంబంధానికి మూలమని ఆయన విశ్వసించారు.

త్యాగనిరతి ఆయనకు సహజగుణం. పదవులు ఆయనను వెదుక్కుంటూ వచ్చాయి; ఆయన మాత్రం వాటిని బాధ్యతలుగానే స్వీకరించారు.

ఏ పదవినైనా ప్రజాసేవకు వేదికగా భావించారే తప్ప, పేరు–ప్రతిష్ఠలు గానీ, సంపద గానీ సమకూర్చుకునే సాధనంగా ఎప్పుడూ తలచలేదు. పదవి ఉన్నా లేకున్నా...ఆయన ఎప్పుడూ "మండలి"గానే (ఫలపుష్పభరితమైన తరుశాఖలా) నిలిచారు.

ప్రజాజీవితంలో ఆయన అహర్నిశలు శుద్ధమైన సంకల్పంతో కృషి చేసి, సోపానక్రమంలో ఎదిగి, జనహృదయాల సీమల్లో ఉన్నత స్థానం సంపాదించారు. ఇతరులను నొప్పించని మనస్వి. రాజకీయ ప్రత్యర్థుల పట్ల కూడా ఆయన ప్రదర్శించిన సౌహార్దత, విరోధులనూ నిరుత్తరులను చేసింది. బలహీన వర్గాల పట్ల ఆయన చూపిన సానుభూతి ఆయన సౌజన్యానికి సజీవ సాక్ష్యం.

దేశప్రగతిలో భాగస్వాములైన బడుగు వర్గాల ప్రజలందరికీ సమానావకాశాలు లభించాలని, వారి జీవితాలు సుఖమయంగా మారాలని, జాతి భవితవ్య నిర్మాణంలో

వారు క్రియాశీల పాత్ర వహించాలని ఆయన హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. వినోబాజీ భూదానోద్యమానికి ఉత్తేజితులై, స్వాతంత్ర్య సమరయోధుడిగా తనకు లభించిన ఐదు ఎకరాల భూమిని పేద కుటుంబాలకు పంచివ్వగలిగిన మానవతావాది ఆయన. అప్పటినుంచి ప్రతిఫలాన్ని ఆశించని సేవే ఆయన ధ్యేయమైంది. అలా నాలుగేళ్లపాటు అవనిగడ్డ శాఖను సమర్థంగా నడిపించిన సేవాతపస్వి శ్రీ మండలి వెంకట కృష్ణారావు..

విద్యార్థి నాయకుడిగా

ఇదీ మండలివారి మాటల్లో ఆనాటి దివిసీమ పరిస్థితి...

1941 వ్యక్తి సత్యాగ్రహ కాలం అది. గాంధీజీ వ్యక్తిగత సత్యాగ్రహానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా వేలాదిమంది సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అవనిగడ్డలో శ్రీ వేమూరి నారాయణమూర్తి, శ్రీ చిరువోలు రాధాకృష్ణమూర్తి, శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తిగార్లు సత్యాగ్రహం చేస్తున్నారని తెలిసింది. సత్యాగ్రహాన్ని చూడాలని, జేజేలు కొట్టి ప్రోత్సహించాలని జాతీయ భావం గల మేము కొందరు విద్యార్థులం అక్కడికి వెళ్లాం.

ఒక రోజు వేమూరి నారాయణమూర్తిగారు స్టేట్ బ్యాంకు వద్ద సత్యాగ్రహం చేశారు. పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. మరుసటి రోజు శ్రీ చిరువోలు రాధాకృష్ణమూర్తిగారు బందలాయి చెరువు వద్ద సత్యాగ్రహం చేశారు. మూడవ రోజు అవనిగడ్డ పార్కు వద్ద శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తిగారు సత్యాగ్రహం చేయగా, పోలీసులు వచ్చి జనంపై లాఠీచార్జి చేశారు. మాకూ దెబ్బలు తగిలాయి. అప్పుడే మాకూ సత్యాగ్రహం చేయాలనే తపన కలిగింది.

కానీ, మేము 14, 15 సంవత్సరాల విద్యార్థులం కావడంతో పెద్దలు మా సత్యాగ్రహాన్ని అంగీకరించలేదు. అందువల్ల జాతీయ భావాలు కలిగిన విద్యార్థులమంతా సమావేశమై జాతీయ విద్యార్థి సంఘంను ఏర్పాటు చేశాం. ఆ సంఘానికి అధ్యక్షునిగా నన్నే ఎన్నుకున్నారు.

1942 ఆగస్టు 9వ తేదీన బొంబాయిలో కాంగ్రెస్ పార్టీ సమావేశమై “క్విట్ ఇండియా” తీర్మానాన్ని ఆమోదించింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులను నిర్బంధించారు. కాంగ్రెస్ సంస్థలను నిషేధించారు. జాతీయ విద్యార్థి సంఘాలపై నిఘా పెరిగింది. కృష్ణారావుగారికి జాగ్రత్తగా ఉండాలని పలుమార్లు హెచ్చరికలు వచ్చాయి.

కానీ, ఆంగ్లేయ ప్రభుత్వం కాంగ్రెస్‌పై ఎంతటి ఆంక్షలు విధించినా ఆయన ఏమాత్రం చలించలేదు. మండలివారు ఒక ఉద్యమపు నీడలో కాదు, ఒక విద్యార్థి నాయకుడిగా స్వయంగా వెలుగులోకి వచ్చారు. దివి తాలూకా కాంగ్రెస్ సమితి సంచాలకుడిగా పగలు కనిపించని, రాత్రులలోనే సాగే అనేక రహస్య కార్యక్రమాలను కాంగ్రెస్ తరపున నిశ్శబ్దంగా నిర్వహించారు. ఆచరణ నిశ్శబ్దమైనా...ఆలోచనలు మాత్రం ఉప్పెనలుగా ప్రవహించేవి.

"క్విట్ ఇండియా నినాదాలతో, కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని, నిర్బంధ-నిషేధాజ్ఞలను తొలగించాలని వ్రాసిన వాల్ పోస్టర్లు అంటించడం, ఎక్కడపడితే అక్కడ కాంగ్రెస్ జెండాలు కట్టడం ప్రారంభించాం. టెలిఫోన్ తీగలను తెంచడం లాంటి కార్యక్రమాలు కూడా చేశాం," అని ఆయన చెప్పారు..

1943 ఆగస్టు 9వ తేదీ ఓ జ్ఞాపకం

క్విట్ ఇండియా తీర్మానం చేసి సంవత్సరం పూర్తైన రోజు...1943 ఆగస్టు 9. ఆ సందర్భాన్ని ఘనంగా జరపాలని మేము నిర్ణయించుకున్నాం. నాలుగు బ్యాచ్‌లుగా విభజించుకున్నాం. మా బ్యాచ్‌లో హైస్కూలు తెలుగు పండితులు శ్రీ చిలకపాటి సుబ్బారావుగారి మేనల్లుడు శ్రీ పరుచూరి రాధాకృష్ణమూర్తి, నేనూ ఉన్నాం.

ఉన్నత పాఠశాల గోడలపై జాతీయ జెండాలు కట్టే బాధ్యత మాకు అప్పగించారు. అది నిజంగా ఒక రాత్రి సాహసయాత్రే! ఆగస్టు 8 అర్ధరాత్రి 12 గంటలకు పాఠశాల గోడలు దూకి లోపలికి ప్రవేశించాం. అక్కడ తాచుపాములు ఉంటాయని చెబుతారు... మేమేమీ లెక్కచేయలేదు. బయట రోడ్లపై పోలీసులు పహారా తిరుగుతున్నారు. చీకట్లో గోడలకు వాల్‌పోస్టర్లు అంటించేశాం.

పాఠశాల భవనంపైకి ఎక్కే వీలులేక, పాకపై, బొప్పాయి చెట్లకు జెండాలు కట్టాం. దొడ్డితలుపు తెరిచి బయటకు వచ్చేశాం. రాధాకృష్ణమూర్తి తన ఇంటికి వెళ్లాడు.

నేను మా గదికి వెళ్తుండగా కాపలా తిరుగుతున్న ఒక పోలీసు నన్ను పట్టుకున్నాడు. లాఠీతో కొట్టి, "చేయి జిగురుగా ఉంది...ఏమిటి?" అని అడిగాడు. చంకలో వాల్‌పోస్టర్లు, జెండాలు చూసి పోలీస్ స్టేషన్‌కి పదమన్నాడు.

నా వివరాలు అడిగాడు. "మా బాబాయి మండలి సత్యనారాయణగారు... అశ్వారావుపాలెం కరణం" అని చెప్పాను. ప్రభుత్వంలో ఆయనకు మంచి పేరు ఉంది. "వారి అన్నగారి అబ్బాయి" అనగానే ఆ కానిస్టేబుల్ కేకలు వేసి, "ఇంటికి వెళ్లిపో!" అని వదిలేశాడు.

అదే రాత్రి ఇతర బ్యాచ్‌లలో పాల్గొన్న నలుగురు-ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారని మర్నాడు ఉదయం తెలిసింది..

గొట్టిపాటి బ్రహ్మయ్యగారితో తాతామనుమడు బంధం

1943 డిసెంబరులో కొంతమంది కాంగ్రెస్ నాయకులను విడుదల చేశారు. జైలు నుంచి వచ్చిన అనంతరం శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారితో కలిసి మేము గ్రామాల వెంట తిరిగాం.

రాజకీయంగా వారు నన్నెంతో ప్రోత్సహించారు. మేమిద్దరం తాత, మనుమలలా ఆప్యాయంగా మెలిగేవాళ్లం.

శ్రీ ఆత్మూరి నాగేశ్వరరావుగారు అవనిగడ్డలో ఒక ఆశ్రమంలాగా తన ఇంట్లో సౌకర్యాలు కల్పించి కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించేవారు. వారి సాన్నిహిత్యం, ప్రోత్సాహం నాకు మరింత బలమిచ్చాయి.

ఆంధ్ర విద్యార్థి పౌరసత్వ కళాశాలకు ఆచార్య రంగాగారిని ఆహ్వానించి, వారం రోజుల పాటు అవనిగడ్డలో కార్యక్రమాలు నిర్వహించాం.

కమ్యూనిస్టుల బెడదను ఎదుర్కొనేందుకు అవనిగడ్డలో కాంగ్రెస్ సేవాదళ క్యాంపును ఏర్పాటు చేసి, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారిని, అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ ఆర్గనైజర్ శ్రీ ఇనాందార్ గారిని ఆహ్వానించి తీసుకువచ్చాం..

విద్యార్థి కాంగ్రెస్ నాయకత్వం

1945లో జిల్లా విద్యార్థి కాంగ్రెస్ నిర్వాహక కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ ఏడాదే అవనిగడ్డలో రెండు వారాలపాటు ఆంధ్ర విద్యార్థి పౌరసత్వ కళాశాలను నిర్వహించారు. అది కేవలం విద్యాసంస్థగా కాదు; స్వేచ్ఛ కోసం సిద్ధమవుతున్న యువ మనసుల శిబిరంగా దిగ్విజయంగా సాగింది.

1946లో జిల్లా విద్యార్థి కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై, అదే ఏడాదే అవనిగడ్డలో రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ శిక్షణ శిబిరాలను నిర్వహించారు. డిటెన్షన్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలకు గురైన సంఘటనలు కూడా ఎదుర్కొన్నారు.

1948లో ఢిల్లీలో జరిగిన ఆసియా విద్యార్థి మహాసభలో మద్రాస్ రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొని రెండు వారాలపాటు జరిగిన సమావేశాల్లో యువజన నాయకుడిగా ముద్ర వేశారు. ఆయన నిర్విరామ సేవ, నాయకత్వ దక్షత దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి.

అదే సంవత్సరంలో గాంధీగారు మరియు ఇతర జాతీయ నాయకులు కారాగారాల నుంచి విడుదలయ్యారు. పట్టాభిగారిని ఆహ్వానించి విశ్వనాథపల్లి, కొత్తపాలెంలో సభలు నిర్వహించాము; శ్రీ కల్లూరి సుబ్బారావుగారిని ఆహ్వానించి అవనిగడ్డలో విద్యార్థి–యువజన మహాసభలు ఏర్పాటు చేశాం; శ్రీ కల్లూరి చంద్రమౌళి, శ్రీ నీలం సంజీవరెడ్డి గార్లను ఆహ్వానించి పెదప్రోలులో కాంగ్రెస్ సభలు నిర్వహించాము. ఆ సభలో కమ్యూనిస్టుల దాడిలో శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తి గారికి గాయాలు వచ్చాయి.

కాంగ్రెస్ సంఘాలను నిషేధించిన కారణంగా, దివి తాలూకా కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేసి శ్రీ వేములపల్లి నాగయ్యగారిని అధ్యక్షులుగా, నన్ను కార్యదర్శిగా చల్లపల్లి

సమావేశంలో ఎన్నుకున్నారు. గ్రామాల వారీగా తిరిగి కాంగ్రెస్ సంఘాలను ఏర్పాటు చేయడం ఒక మహాయజ్ఞంగా నిలిచింది.

అదే సంవత్సరం, బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి వెళ్లే అవకాశం వచ్చింది. వెళ్ళటానికి ఇంట్లో వాళ్లు అంగీకరించరని పెద్దలెవ్వరికీ చెప్పకుండానే కృష్ణారావుగారు బొంబాయి రైలు ఎక్కేశారు. అది యువహృదయ ధైర్యంగా నిలిచింది.

గాంధీజీ ఆ సమావేశానికి రాలేదు. అయినా నిరాశ చెందకుండా, బిర్లా భవన్లో ఉన్నారని తెలిసి అక్కడకే వెళ్లి, మహాత్ముని దర్శించారు. నిజంగా, ఆ మహాత్ముని సాన్నిధ్యంలో ఆయన పొందిన ఉత్తేజం ఆయన అంతరాత్మలో దీపంలా వెలిగింది. ఆ క్షణం ఆయన జీవితంలో ఒక మహత్తరమైన స్మృతిగా నిలిచింది..

చదువుకు తాత్కాలిక విరామం

అదే ఏడాదే స్కూల్ ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు.

కాలేజీ చదువుకు వెళ్లాలనుకునే ఆలోచన ఉన్నా, రాజకీయాలలో యాక్టివ్ జీవితం ఆయన చదువును అడ్డుకోలేదు. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు కారణంగా ఒక సంవత్సరం ఇంటివద్దే ఉండాల్సి వచ్చింది.

ఒకరోజు పశువుల కాపరి రాకపోవటంతో, పశువులను మేతకు తోలుకొని వెళ్లారు. ఇసుక దిబ్బ మీద నిలబడి, నాలుగు వంకలూ విస్తరించిన దివిసీమను చూశారాయన. దూరంలో అలసటలేని సాగర తరంగాలు, తీరానికి నికరుగా పచ్చగా విస్తరించిన భూమి, కానీ పంటలు మాత్రం మౌనంగా ఒక మూలన కనిపించాయి.

ఆ క్షణంలో ఒక ఊహ, ఒక ఆకాంక్ష ఆయన మనోవీధిలో మెరిసింది:

"ఈ భూమిని సమగ్రంగా సాగుచేస్తే, ఈ దివిసీమ దివ్యసీమగా మారుతుంది కదా... అసంఖ్యాకులైన అన్నార్తుల కడుపులు నిండుతాయని...!"

ఆ రోజు కన్న కల, ఒక ఊహగా మిగలలేదు; అది నిర్విరామ కృషిగా మారింది. చివరికి, 1967లో దివిసీమ సహకార వ్యవసాయ బృహత్తర ప్రణాళికగా సాకారం అయ్యింది.

ఇలా, ఒక యువకుడి కల ఒక ప్రాంతపు భవితవ్యంగా మారిన కథ ఇది.

బంజరు భూముల కోసం పోరాటం

పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన తొలి సందర్భం ఆ రోజులలోనే శ్రీ కృష్ణారావుగారి ముందుకు వచ్చింది. ఆ సమయంలో దివిసీమలో 15,000 ఎకరాల బంజరుభూమి ఉంది. వాటిలో కొంతభూమిని రైతులు చాలా కాలంగా సాగుచేసి జీవనం కొనసాగిస్తున్నారు.

కానీ 1945లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలోని నాటి ఎడ్వైజరీ ప్రభుత్వం, ఏటిమొగ, భావదేవరపల్లి, కమ్మనమోలు, మందపాకల గ్రామాల్లోని సుమారు 3,000 ఎకరాల భూమిని మాజీ సైనికులకు కేటాయించగా, చిరకాలంగా సాగు చేస్తున్న రైతులకు ఎవిక్షన్ నోటీసులు జారీ చేసింది.

ఈ అన్యాయం సహించలేని కృష్ణారావుగారు, నోరులేని పేద రైతుల తరఫున ప్రభుత్వాన్ని ఎదుర్కొని స్టే ఆర్డర్ సాధించారు. 1946లో ప్రకాశంగారు ముఖ్యమంత్రిగా ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత, వేముల కూర్మయ్యగారు హరిజన సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కృష్ణారావుగారు బంజరు భూముల విషయంలో నిరుపేద రైతుల అన్యాయం స్పష్టంగా చూపించి, మొదటినుంచి సాగు చేస్తున్న రైతులకే ఆ భూములు చేర్చేలా చేయగలిగారు.

ఇది సాంఘిక సంక్షేమ రంగంలో ఆయన సాధించిన తొలి ఘనవిజయంగా నిలిచింది.

స్వాతంత్ర్య సిద్ధి నాటికి యోధానుయోధుడిగా...

"దివిసీమలో మేము పాల్గొన్న జాతీయోద్యమ కార్యకలాపాలకు బలమైన పీఠాలే కదిలిపోయాయి. జమీందారీ వ్యవస్థ రద్దయింది. మేము నేరుగా పాల్గొన్న మూడు ప్రధాన పోరాటాలలో సంపూర్ణ విజయాన్ని సాధించగలిగాము.

కాంగ్రెస్ ఉద్యమాలలోనే కాదు... విద్యార్థి, యువజన, కిసాన్ ఉద్యమాలలో కూడా చురుకుగా పాల్గొని, ఆయా వర్గాల సంక్షేమానికి అంకితమయ్యాము. ఈ దేశ స్వాతంత్ర్యసిద్ధికి, ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి, తదనంతరం ఆంధ్రప్రదేశ్ అవతరణకు ఉడుతాభక్తితో సేవచేసే అవకాశాలు నాకు లభించాయి.

రైతాంగ విద్యాలయాన్ని నడిపాము. బంజరు భూములను పేద రైతులకు దక్కించేందుకు సాగించిన పోరాటంలో విజయం సాధించి, భూముల పంపిణీ చేయించాము. భూసంస్కరణల చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చి, మిగులు భూములను నిరుపేదలకు పంచగలిగాము. సాగునీటి సౌకర్యాలు పెంచి, సేద్యానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాము.

విద్యార్థుల హక్కుల కోసం పోరాడాము. డిటెన్షన్ వ్యతిరేక ఉద్యమంలో లాఠీచార్జికి గురైనాము. చివరికి డిటెన్షన్ పద్ధతిని పూర్తిగా ఎత్తివేయించగలిగాము...." ఇలా ఆయన "జాతీయోద్యమ స్మృతులు" వ్యాసంలో తన జీవితపోరాటాన్ని సూటిగా, గర్వమెరుగని వినయంతో లిఖితబద్ధం చేసుకున్నారు..

ధర్మపత్ని ప్రభావతిగారు: వెన్నంటి నడచిన అనురాగమయి

భోగాది వెంకటరామయ్య గారి గృహంలో జన్మించిన ప్రభావతి అనే వెలుగు, 1958లో కృష్ణారావుగారి జీవితంలో ప్రవేశించి దీపంగా మారింది.

"ఇంటిని చూసి – ఇల్లాలిని చూడు" అన్న పెద్దల వాక్కుకు జీవనాంతరంగంలోని వ్యాఖ్యానంలా ఆమె నిలిచింది. ప్రజాహితమే శ్వాసగా నిరంతరం శ్రమించే భర్త జీవితంలో, ఎన్ని చేదు అనుభవాలు ఎదురైనా, ప్రభావతిగారు చేదోడుగా నిలబడి, ఆయన వెన్నంటి నీడలా నడిచారు.

పరస్పర గౌరవం, అవగాహన, మౌనమైన త్యాగం...ఈ మూడు మూర్తులా వారి సంసారానికి పునాదులయ్యాయి.

ఈ దంపతులకు ఇద్దరు కుమారులు...బుద్ధప్రసాద్, సత్యప్రసాద్; ఇద్దరు కుమార్తెలు... అన్నపూర్ణ, రేవతి. అల్లుళ్లు, కోడళ్లు మామగారి పట్ల ప్రేమాభిమానాలకు మాత్రమే కాక, ఆయన ఆశయాలకు తమ జీవితాలను సమర్పించినవారుగా కుటుంబాన్ని ముందుకు నడిపారు.

పదవులు, ఖ్యాతి వచ్చాయి; అయినా గృహజీవితం ఎప్పుడూ ఆడంబరానికి సరిచేయబడలేదు. వినోద, విలాసాల కంటే మూల్యాలకు ప్రాధాన్యం ఇచ్చే వాతావరణంలో జీవనయాత్ర సాగింది. ఆ ఇంట్లో కనిపించినది భౌతిక వైభవం కాదు... నిబద్ధత, సరళత, మౌనమైన త్యాగమే.

ఇలా ప్రేమ తోడై నడిచిన జీవితం, విలువల ద్వారా తన గమ్యాన్ని చేరుకుంది.

స్వతంత్ర భారతంలో పూర్తిస్థాయి యువనేతగా...

1948 నుండి 1952 వరకు కృష్ణాజిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ, యువతను కాంగ్రెస్ ఆదర్శాల బాటలో నడిపించారు. అవనిగడ్డలో సేవాదళ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు.

రాయలసీమ కరువు బాధితుల కోసం నిధులు సేకరించి వారికి సహాయం అందించారు, అనేక గ్రామాల్లో మహాసభలు ఏర్పాటు చేసి యువజనుల్లో నవచైతన్యాన్ని రగిలించారు.

1952–1956 మధ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా సేవలందిస్తూ, కృష్ణాజిల్లా కాంగ్రెస్ సంస్థలో నూతన శక్తిని నింపారు. విస్తృత శిక్షణ శిబిరాలు నిర్వహించగా, ఒకవైపు సంస్థను పటిష్టం చేస్తూనే, మరోవైపు రైతాంగానికి అండగా నిలిచారు.

బంజరు రైతుల మహాసభలు ఏర్పాటు చేసి వారి సమస్యలను సమగ్రంగా చర్చించి, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలను సూచించారు.

ఈ కృషి ఫలితంగా 1956లో బీదలకు బంజరు భూములు పంచే కార్యక్రమం ప్రారంభమైంది. దివిసీమ ప్రాంతంలో దాదాపు పది వేల ఎకరాల భూమిని పేదలకు అప్పగించడం ఆయన ఘనతగా నిలిచింది.

తదుపరి, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా నియమితులై, 1958 వరకు ఆ బాధ్యతను అత్యంత సమర్థతతో నిర్వర్తించారు.

భూదాన యజ్ఞ సంఘ నిర్వాహకులుగా, ప్రజల నుంచి విరాళాలు సేకరించి, మచిలీపట్నంలో గొట్టిపాటి బ్రహ్మయ్య షష్టిపూర్తి సందర్భంలో జిల్లా కాంగ్రెస్ భవన నిర్మాణానికి ప్రధాన కర్తృత్వం వహించారు.

పట్టాభిగారి ప్రభావం 'మౌన బలం'

మండలి వెంకట కృష్ణారావుగారికి డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారంటే, అమితమైన గౌరవ ప్రపత్తులు. అనేక విషయాల్లో ఆయన్ను మండలివారు ఆదర్శంగా తీసుకున్నారు.

1945లో డా॥ పట్టాభి జైలు నుండి విడుదలైన తర్వాత, కృష్ణారావుగారు ఆయన ఇంటికి వెళ్లి దర్శించుకున్నారు.

ఆ సమయంలో పట్టాభిగారు తన కార్యాలయం కుర్చీలను తుడుస్తూ కనిపించారు. అంతటి జాతీయ నాయకుడు, గాంధీగారికి అత్యంత సన్నిహితుడు, మహా మేధావి అయినప్పటికీ సాధారణ జీవితాన్ని గడపటాన్ని చూసి కృష్ణారావుగారు ఆశ్చర్యపోయారు.

"రాజకీయాలు, చదువు రెండూ కలిపి చేయగలవా?" అని ఆయన అడిగారు. "అవును" అని సమాధానం చెప్పగానే, "బాగా చదువు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగు" అని ఆశీర్వదించారు. ఈ సంభాషణ కృష్ణారావు గారి జీవితానికి కొత్త శక్తి, కొత్త దిశను ఇచ్చింది. గాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాల వైపుకు ఆయనను నడిపింది.

డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు గాంధీ సిద్ధాంతాలను కార్యరూపంలోకి మార్చిన మహనీయుడు. ఆయన కృషి వైద్య రంగం మాత్రమే కాదు; ఆర్థిక, రాజకీయ, ప్రజా నైతికతలోనూ సమానంగా పట్టు చూపింది.

"Spend with caution" అన్న సూత్రం ఆయన జీవితమంతా ప్రతిబింబించింది. పాడైన ధోతీలు కుట్టించి పేదలకు పంచటం, పాత చొక్కాలను రుమాళ్లుగా మార్చడం, లేఖల కవర్లను వెనక్కి తిప్పి తిరిగి ఉపయోగించడం... ఈ విధానం ఆయన గాంధీ శిష్యత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

1954లో, కాంగ్రెస్ భవనం మరమ్మతుల కోసం ప్రతిపాదనలు వచ్చినప్పుడు, "మొత్తం అవసరమా? లేక విడతలుగా పంపుదామా?... నిధులు జాగ్రత్తగా వినియోగించండి" అని పేర్కొన్నారు. గతంలో ఖర్చులు లెక్కచేయని సందర్భాలను మండలి గారి దృష్టికి తెచ్చారు. ఇది ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనం.

ఆంధ్రా బ్యాంక్, భారత్ లక్ష్మీ బ్యాంక్, సహకార బ్యాంకులు, ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీ, ఆంధ్రా ఇన్సూరెన్స్, హిందుస్తాన్ ఐడియల్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవిత బీమా అవగాహన తీసుకువచ్చారు.

దివిసీమలో కాంగ్రెస్ జ్యోతి వెలిగించడంలో పట్టాభిగారి పాత్ర అత్యంత ముఖ్యమైనది. క్విట్ ఇండియా ఉద్యమం తర్వాత, కమ్యూనిస్టులు "ప్రజాపోరాటం" పేరుతో కాంగ్రెస్ ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించగా, కోటపాలె సమావేశంలో పట్టాభి గారు పూల హారాలను తిరస్కరించి, ఖాదీ సూతలతో చేసిన హారాలను మాత్రమే స్వీకరించారు. ఆయన ప్రసంగం స్పష్టంగా, శక్తివంతంగా సాగి దివిసీమలో కాంగ్రెస్ ఆత్మను మళ్లీ వెలిగించింది..

ప్రజాప్రతినిధిగా – సంక్షేమ శిల్పిగా

1963 నుంచి 1969 వరకు మండలి వెంకట కృష్ణారావుగారు కృష్ణాజిల్లా పరిషత్ ఉపాధ్యక్షులుగా, ఆహారోత్పత్తి సంఘం అధ్యక్షులుగా పనిచేశారు.

ఈ సమయంలో కృష్ణాజిల్లాలో వ్యవసాయాభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై ప్రభుత్వం కోసం సమగ్ర నివేదికలను సిద్ధం చేసి, అభివృద్ధి దిశను స్పష్టంగా సూచించారు.

1970లో అవనిగడ్డ పంచాయతీ సమితి అధ్యక్షులుగా ఎన్నికై, స్థానిక పాలనలో చైతన్యాన్ని నింపారు. 1969 నుంచి 1972 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నిర్విరామ సేవ చేసి, ఆ సంస్థను మరింత పటిష్టం చేశారు. లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో రాష్ట్రంలో ఘనవిజయం సాధించడంలో ఆయన చేసిన కృషి అపారంగా గుర్తించబడింది.

1954 నుంచి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ, జాతీయ స్థాయిలోనూ తన సేవాముద్ర వేశారు. మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా అవనిగడ్డలో "గాంధీ సేతు" నిర్మాణానికి శ్రీకారం చుట్టి, దివిసీమను దివ్యసీమగా తీర్చిదిద్దాలని తన సంకల్పానికి ప్రతీకగా నిలిపారు.

ఈ ప్రాంతంలో ఆయన నావికా రవాణా, మత్స్య పరిశ్రమాభివృద్ధి ప్రణాళికలు చేపట్టి ప్రజాజీవితానికి నూతన ఊపిరి పోశారు. ప్రజల సంక్షేమం, భూసంపత్తి సురక్షిత నిర్వహణ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి...అన్ని వైపులా ఆయన ప్రభావం స్పష్టంగా కనిపించింది.

నాగాయలంక నుండి అవనిగడ్డకు

శ్రీ మండలి వెంకట కృష్ణారావు 1957లో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన తరువాత, నాగాయలంక నుంచి అవనిగడ్డకు వారి నివాసాన్ని మార్చుకున్నారు. అవనిగడ్డ సంత

మార్కెట్టు సందులో వారి నివాసం ఉండేది. ఆ సమయానికి బుద్ధప్రసాద్ గారు పుట్టి కేవలం రెండు నెలలు మాత్రమే ఉన్న చిన్న బిడ్డ. బిడ్డ పుట్టగానే, కృష్ణారావుగారు ఏకగ్రీవంగా పార్లమెంటరీ నియోజకవర్గానికి ఎన్నిక కావడం తన జీవితంలో గొప్ప ఘట్టం. ఇంటికి స్థానికులు "బుద్ధభవన్" అని పేరు పెట్టారు.

తరువాత సంత మార్కెట్టు ఇల్లు అమ్మి, అవనిగడ్డ హైస్కూల్ ఎదురు స్థలాన్ని కొని కొత్త ఇల్లు నిర్మించారు. ఆ సమయానికి ఆ పరిసర ప్రాంతమంతా పొలాలతో మాత్రమే కప్పబడి ఉండేది. హైస్కూల్ మాస్టరు శ్రీ కోసూరి సుబ్బారావు గారి ఇల్లు ఒక్కటే ఉండేది. ఎదురుముఖంగా ఉన్న బ్రాహ్మణుల ఇళ్లు మాత్రమే కనిపించేవి, ఆ భూములన్నీ బ్రాహ్మణులకు చెందినవే! ఆ ఇంటి స్థలాన్ని కొని, ఆ ప్రాంతానికి "విద్యానగర్" అనే పేరు పెట్టారు.

బందరు పార్లమెంటు సభ్యునిగాప్రజావిశ్వాసపు ప్రస్థానం

1957లో ఒక అనూహ్య రాజకీయ పరిణామం చోటు చేసుకుంది.


కాంగ్రెస్ అధిష్టానం, కాశీనాథుని పూర్ణమల్లికార్జునుడు, పట్టాభిగారు, గొట్టిపాటి బ్రహ్మయ్యగార్ల సూచనమేరకు మండలి వెంకట కృష్ణారావుగారి పేరును పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీకోసం ప్రకటించారు.

30 ఏళ్ళ వయసు మాత్రమే ఉన్న ఆ యువకుడు పార్లమెంట్ సభ్యుడా...? అని ఆ సీటు ఆశించిన పెద్దలు ముక్కున ఆశ్చర్యపోయారు. చిన్న వయసుకే ఎంపీ సీటు లభించడం కాంగ్రెసు పెద్దలు జీర్ణించుకోలేనిది.

కానీ, మండలి వెంకట కృష్ణారావుగారి నిజమైన ఎన్నికల చిహ్నం ప్రజల విశ్వాసమే. ప్రత్యర్థులు ఎంత వ్యతిరేకంగా ప్రయత్నించినా, ఓటరు తీర్పు స్పష్టంగా ఆయన వైపు వచ్చింది. ఏడువేల ఓట్ల మెజారిటీతో ఆయన ఘన విజయం సాధించారు.

1957 నుంచి 1962 వరకు పార్లమెంట్ సభ్యుడిగా ఆయన సాగిన ప్రయాణం సేవాభావానికి ప్రతిరూపం. రాష్ట్రాభ్యుదయం, జాతీయ శ్రేయస్సు...ఈ రెండు ఆయన కార్యాచరణకు రెక్కలే. ప్రజాహిత సేవారంగమే ఆయనకు బహుముఖ వేదిక. లోక్‌సభ సభ్యత్వం ఆయన రాజకీయ జీవితంలో కొత్త అధ్యాయాన్ని నిశ్శబ్దంగా ప్రారంభించింది.

ఈ కాలంలో జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ రాధాకృష్ణన్ వంటి మేధావులకు దగ్గరగా పరిచయం అయ్యే అవకాశం ఆయనకు లభించింది. ఇది కేవలం వ్యక్తిగత గౌరవం కాదు; దేశాన్ని లోతుగా అర్థం చేసుకోవడం, ప్రజల సమస్యల మూలాలను తెలుసుకోవడం అనే అరుదైన అనుభవం. జాతీయ స్థాయిలో ప్రజల సమస్యలను ఆయన స్పష్టంగా పట్టుకున్నారు.



మచిలీపట్టణం నియోజకవర్గం నుండి
పార్లమెంటుకు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా
గుర్రంపై ఊరేగింపు

పార్లమెంట్‌లో ఉన్నప్పటినుండే, గొట్టిపాటి బ్రహ్మయ్యగారి షష్టిపూర్తి సన్మాన సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరించి, విరాళాలు సమీకరించి, అరవై వేల రూపాయల వ్యయంతో బందరులో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయ భవనంపై 'బ్రహ్మయ్య హాలు' నిర్మించారు.

1958 డిసెంబర్ 31న బ్రహ్మయ్యగారి షష్టిపూర్తి మహోత్సవం ఘనంగా జరిగింది, ఆ వేడుకల వెనుక కృష్ణారావుగారి సంఘటనాశక్తి మౌనంగా నిలిచింది.

అలా, ప్రజావిశ్వాసం నుండి మొదలైన ఆయన ప్రయాణం, సేవాపూర్ణకార్యాలు, స్మారక నిర్మాణాలతో చరిత్రలో అమితమైన ముద్ర వేసుకుంది..

రెండో ఎన్నికల్లో ఓటమి

1962లో తిరిగి పార్లమెంట్ బరిలో నిలిచినప్పటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

ప్రత్యర్థులందరూ ఏకమై, అంగబలం, అర్థబలం రెండూ సమృద్ధిగా ఉన్న పెద్దల సమూహం, 36 యేళ్ల యువకుని ఎదురై గెలుపుకు అడ్డుగా నిలిచింది.

శాయశక్తులా ఆ శక్తులు చేసిన ఆ సమిష్టి ప్రయత్నం ఫలితంగా గెలుపు–ఓటముల మధ్య తేడా కేవలం 2000 ఓట్లు మాత్రమే అయ్యింది. ఎలాగైతేనేం మండలి వారిని ఓడించామా లేదా అన్నదే వాళ్లకి ముఖ్యం అయ్యింది. మండలివారి ఓటమి తేడా అత్యల్పం!

బందరు పార్లమెంటు నియోజకవర్గానికి ఆది నుండీ ఒక ఆచారం ఉంది…రెండోసారి గెలవటం అక్కడ అరుదు. గెలుపు ఓటముల మధ్య వ్యత్యాసం చెప్పుకోదగినంత ఉండదు.

ఎన్నికల ప్రచారంలో తాను స్నేహంగా నడిపించిన యువ కార్యకర్తలు తమ శ్రమ ఫలించలేదని కంటతడి పెట్టుకుంటూ ఆయన వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఆయన పలికిన మాటలు ఓదార్పుగా మాత్రమే కాక, ఒక రాజకీయ తత్వంగా కూడా మారాయి:

"మనం దేశం కోసం పనిచేసే కార్యకర్తలం! కార్యకర్తలకు గెలుపు ఏమిటి? ఓటమి ఏమిటి? పదవి వచ్చినా దేశసేవకు అవకాశం ఉంటుంది; రాకపోయినా ఉంటుంది. పదవుల ద్వారా సొంత ప్రయోజనాలు సాధించాలనుకునేవాళ్లు ఓడితే బాధపడాలి గాని…మనకు బాధ ఎందుకు?"

ఈ మాటలలోనే ఆయన రాజకీయ జీవితం సారాంశం స్ఫుటమైంది.

గెలుపు–ఓటములకతీతంగా, సేవే లక్ష్యంగా ముందుకు నడిచే ప్రజానాయకుడుగా శ్రీ మండలి వెంకట కృష్ణారావు నిలిచారు.

గాంధీక్షేత్రం వ్యవస్థాపన

మండలి వెంకట కృష్ణారావుగారికి గాంధీజీ అంటే వ్యక్తి మాత్రమే కాదు; ఒక సత్యస్మరణ.

ఆయన బోధనలు ఉపదేశాలుగా కాక, నిత్యజీవన సాధనగా ఆయన అంతరంగంలో నిలిచిపోయాయి. గాంధీజీ చేసిన ప్రతి ప్రయత్నం, ప్రతి ప్రయోగం కృష్ణారావుగారికి కరదీపికలా వెలిగింది. ఆ వెలుగులోనే ఆయన తన అడుగులను కొలిచి, దేశసేవ మార్గంలో నడిచారు. సంఘసేవ, దేశసేవ... రెండు దారులు కాదు, ఒకే సత్యానికి చెందిన రెండు శ్వాసలు.

ఆ అవిభాజ్య సేవాధర్మాన్ని ఆయన జీవనసంకల్పంగా మలచుకున్నారు. ఆ సంకల్పమే ఆవనిగడ్డలో స్వప్థలమైన గాంధీక్షేత్రం నిర్మాణానికి నడిపింది.

"1969లో గాంధీజీ శతజయంత్యుత్సవాలు సందర్భంగా, అవనిగడ్డలో గాంధీక్షేత్రాన్ని స్థాపించారు. దానితో అనుబంధంగా అనేక ప్రజాహిత కార్యక్రమ సంస్థలు వెలసాయి... మహిళా సేవా సంఘం, దివిసీమ లలిత కళా సమితి, దివిసీమ సాహితీ సమితి, గ్రామీణ యువజన వికాస సమితి, దీనజన సంక్షేమ సమితి. ఇవన్నీ విద్యా, వినోద, కళా, గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతున్నాయనీ, ముద్రణాలయం, రూత్ డైక్‌మన్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్, వికలాంగుల శిక్షణాలయాలు ఏర్పాటు చేశారు. 'గాంధీక్షేత్రం' పత్రిక శ్రీ బుద్ధప్రసాద్ సంపాదకత్వంలో వెలువడుతోంది" అని వ్రాశారు. శ్రీ పి.యస్.ఆర్. అప్పారావు.

గాంధీక్షేత్రం... ఇటుకల కట్టడమే కాదు; శ్రమ, సత్యం, స్వావలంబనలతో నిర్మితమైన జీవన సాధనాక్షేత్రం.

ప్రతి రోజు గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలు మౌనంగా, నిరంతరంగా ఆచరించ బడతాయి. ప్రతి అడుగు సేవతో నిండినది, ప్రతి కార్యం ధర్మస్పర్శ కలిగినది.

దివిసీమలో గాంధీక్షేత్రం దర్శనీయ స్థలమే కాదు, ఒక ధ్యానస్థలం.

అంతరంగ ధ్యానముగా, ఆశయధర్మ ప్రఫుల్లంగా, కృష్ణారావుగారి హృదయం నిశ్శబ్దంగా వికసించిన స్థానం. అందుకే ఇది ఒక ఆధునిక యాత్రాస్థలం...శబ్దం కాదు, సాధన బోధించే స్థలం.

అలాగని గాంధీక్షేత్రమే ఆయన సేవకు హద్దుకూడా కాదు.

కృష్ణారావుగారి సేవారంగం యావదాంధ్ర దేశమంతటా విస్తరించింది!

గాంధీయ నిర్మాణ కార్యక్రమాలే కాక, జాత్యభ్యుదయానికి దోహదమిచ్చే ఏ కార్యమైనా ఆయనకు సాధనార్హం. ఒకసారి చేతబట్టి తీసుకున్నాక, దానికి స్థిర రూపం ఏర్పడే వరకు విశ్రాంతి కోరుకునేవారు కాదు. అది ఆతృత వల్ల కాదు...నిశ్శబ్ద నిబద్ధతే కారణం! ప్రజాహిత సేవారంగం ఆయనకు బహుముఖ వేదిక.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ, మత్స్యపరిశ్రమాభివృద్ధి సలహామండలి సభ్యులుగా కూడా ఆయన తన సేవలందించారు.

1970 సెప్టెంబరులో ఆగ్నేయ ఆసియా దేశాలను పర్యటించి, అభివృద్ధి నమూనాలను అధ్యయనం చేశారు..

మండలివారు నమ్మిన పంచ సూత్రాలు

జాతి నైతికాభివృద్ధి, సమైక్యత, సమగ్రత కోసం క్రమశిక్షణతో కృషి చేయటమే ఉత్తమ పౌరుడి ధర్మం అని విశ్వసించిన గాంధీయవాది, ఉత్తమ సమాజసేవకులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు. ప్రజాసేవను జీవిత పరమావధిగా భావించి, తెలుగుజాతి సముద్ధరణకు ఆచరణాత్మక ఆదర్శాలను నెలకొల్పారు.

పూలదండల నిరాకరణ:

పూలదండలు అహంకారాన్ని పెంచి, ఈర్ష్యాద్వేషాలకు దారితీయవచ్చని భావించి వాటిని స్వీకరించరాదని నిర్ణయించుకున్నారు. ఎన్ని ఒత్తిడులు వచ్చినా, చిరునవ్వుతో ఎదుర్కొని, తమ నిర్ణయాన్ని సడలించకుండా పొదుపు, సౌమ్యతకు ఆదర్శంగా నిలిచారు.

ఆస్తిపాస్తుల బహిరంగ ప్రకటన:

ప్రజాజీవితంలో పారదర్శకత పెరగాలంటే పాలకులపై అపోహలు తొలగాలని భావించి, మంత్రిగా–శాసనసభ్యులుగా తన ఆస్తిపాస్తులను బహిరంగంగా ప్రకటించారు. ఈ చర్యతో దేశవ్యాప్తంగా పాలకులకు ఆదర్శం ఏర్పడింది.

ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం:

పరిపాలకులు–ప్రజల మధ్య దూరం ఉండకూడదని నమ్మి, మంత్రిగా ఉన్నప్పటికీ బస్సుల్లో ప్రయాణం చేస్తూ ప్రజలతో సన్నిహిత సంబంధాన్ని పెంపొందించారు.

భూదానం:

భూసంస్కరణల చట్టం అమలుకు ముందే, 1973 జూలైలో తన 7 ఎకరాల్లో 5 ఎకరాల సారవంతమైన భూమిని పది నిరుపేద కుటుంబాలకు పంచి, రాజకీయవాదులకు ఆదర్శమార్గాన్ని చూపించారు.

సంపత్తి దానం :

1982 నవంబరు 11న మంత్రిపదవి లభించిన తర్వాత వార్ధా వెళ్లి పౌనార్ ఆశ్రమంలో వినోబాభావే దర్శనం చేసుకున్నారు. ఆ మహనీయుని చూపు ఆయనలో నూతన స్ఫూర్తిని రగిలించింది. భూదానోద్యమ జన్మస్థలమైన పోచంపల్లిలో 26.11.1982న జరిగిన వినోబాజీ శ్రద్ధాంజలి సభలో, ఏటా తన ఆదాయంలో ఆరవవంతు దీనజనోద్ధరణకు వెచ్చిస్తానని ప్రకటించి సంపత్తి దాన సూత్రానికి క్రియారూపం ఇచ్చారు.

సంక్షేమ మంత్రిగా... 'మార్పు'కు మూర్తిరూపం

నిస్వార్థ సేవకు మారుపేరైన శ్రీ మండలి వెంకట కృష్ణారావు 1972 సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీ లేకుండా ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నిక కావడం ప్రజల అపార విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనం.

ఆ తరువాత శ్రీ పి.వి. నరసింహారావు మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమ, మత్స్య పరిశ్రమ శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించి, 1978 జనవరిలో రాష్ట్రపతి పాలన విధించబడే వరకూ ఆ శాఖలను అంకితభావంతో నిర్వహించారు.

తక్కువ వ్యవధిలోనే బడుగు వర్గాల అభివృద్ధి కోసం అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సాంఘిక సంస్కరణలు, మత్స్య పరిశ్రమాభివృద్ధి అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించి, కార్యాచరణకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

హరిజనులు, వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి కోసం సహకార సంస్థలను స్థాపించారు. సమాజంలో సామరస్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో వర్ణాంతర వివాహాలకు ప్రభుత్వ ప్రోత్సాహక పథకానికి నాంది పలికారు.

విద్యార్థి వసతిగృహాల నిర్వహణలో నెలకొన్న అవినీతిని రూపుమాపి, వాటిని ప్రభుత్వ యాజమాన్యంలోకి తీసుకువచ్చేందుకు కఠిన చర్యలు చేపట్టారు. అలాగే, బడుగు వర్గాలకు ఇళ్ల స్థలాలు కేటాయించే కార్యక్రమాన్ని వేగవంతం చేసి, భారత జీవిత బీమా సంస్థ ఆర్థిక సహకారంతో గృహనిర్మాణాన్ని సాకారం చేశారు.

ఆయన నాయకత్వంలో సాంఘిక సంక్షేమ, మత్స్య పరిశ్రమ శాఖలు కొత్త రూపురేఖలు దాల్చి, సమర్థవంతంగా, ప్రజలకందుబాటులో పనిచేసిన శాఖలుగా నిలిచాయి.

సమైక్యవాదానికి నిబద్ధుడిగా...

ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నంత మాత్రాన ఉద్యమాలన్నీ ప్రజా ఉద్యమాలు కావు. ప్రజలను విడగొట్టే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు భావోద్వేగాలను రెచ్చగొట్టి సృష్టించిన జై ఆంధ్ర ఉద్యమాన్ని శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. ఆ నిర్ణయానికి మూలం రాజకీయ లెక్కలు కాదు...అంతరాత్మ ఆజ్ఞ.

ఆ వ్యతిరేకత కారణంగా ఆయనకూ, ఆయన కుటుంబానికీ సామాజిక వెలివేత ఎదురైంది. భౌతిక దాడులకు గురయ్యారు. ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. జనవాక్యానికి ఎదురుగా నిలవడం సాహసమే. అయినా నమ్మిన సిద్ధాంతానికి విరుద్ధంగా, గొర్రెదాటు రాజకీయానికి తలవంచడానికి ఆయన ఏనాడూ సిద్ధపడలేదు. కాలప్రవాహంలో పడి కొట్టుకుపోవడాన్ని, రానున్న పరిణామాల్లో తుడిచిపెట్టుకుపోవడాన్ని

ఆయన స్పష్టంగా నిరాకరించారు. "ఏ ఎండకా గొడుగు పట్టే రాజకీయానికి నేను సిద్ధం కాదు" అని ప్రకటించి, అన్ని పరిణామాలకు సిద్ధపడే సమైక్యవాదం వేపు అడుగు వేశారు.

ఈ అంతర్గత సంఘర్షణ మధ్యనే ఆయన అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఒక బహిరంగ లేఖ వ్రాశారు. ఆ లేఖ ఒక వ్యక్తిగత ఆవేదన మాత్రమే కాదు...రాష్ట్ర సమైక్యతకు ఒక మేనిఫెస్టో.

ఆ లేఖ వ్రాసిన నాటికి రాష్ట్రంలో శ్రీ పి.వి. నరసింహారావుగారి ప్రభుత్వం ఉంది. శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు 1972లో అవనిగడ్డ నుంచి ఏకగ్రీవంగా శాసనసభ్యులై, సాంఘిక సంక్షేమ–మత్స్య శాఖల మంత్రిగా పనిచేస్తున్నారు. రాష్ట్రపతి పాలన ఇంకా విధించబడలేదు.ఆ లేఖలో ఆయన తనను తానే ప్రశ్నించుకుంటూ ఇలా అంటారు...

"మంత్రిపదవిలో ఉండడం గొప్పతనం కాదు. అధికారాన్ని అంటిపెట్టుకోవడం శ్రేయస్కరం కాదు. ఇందులో ఉండడం గౌరవం కాదు...అగ్నిహోత్రంలో నిలబడటమే. ఒక రాజీనామాతో పేరు, ప్రఖ్యాతి, ప్రజామోదం అన్నీ లభిస్తాయి. అయినా ఎందుకు రాజీనామా చేయలేదు? అప్రతిష్ఠను ఎందుకు స్వీకరిస్తున్నాను?"

ఆంధ్రప్రదేశ్ ఐక్యత ఆయనకు ఆశయం. విశాలాంధ్ర ఆయన ఆదర్శం.

ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే చరిత్ర కలిగిన తెలుగుజాతి భారత జాతీయ జీవితంలో గౌరవస్థానం పొందాలన్నదే ఆయన కల. దశాబ్దాల త్యాగాల ఫలితంగా అవతరించిన విశాలాంధ్రను తానే కూల్చివేయాలా? అన్న ప్రశ్న ఆయనను తీవ్రంగా కుదిపేసింది.

ఆయన జీవితాన్ని నడిపించిన శక్తి పదవులు కాదు...ఆశయం.

పదవి, పలుకుబడి అన్నీ ఆశయ సాధనకు పనిముట్లే తప్ప గమ్యం కావని ఆయన విశ్వసించారు. మనిషి విలువ అతడు పొందిన పదవిలో కాదు; తన ముందుంచుకున్న ఆదర్శంలో, దానికి అనుగుణంగా చేసిన కార్యాచరణలోనే ఉందని ఆయన భావన!

ఇది విషమసంధి అని ఆయనకు తెలుసు. పదవిని వదిలిపెట్టవచ్చు...కానీ ఆశయాన్ని ఎలా వదలాలి? పేరు, ప్రఖ్యాతి కోసం ఆదర్శాన్ని త్యజించాలా? లేక అపకీర్తిని స్వీకరించి అయినా ఆదర్శంతో నిలబడాలా? ఇదే ఆయన ఎదుర్కొన్న అసలైన పరీక్ష. ఆయన నిర్ణయం స్పష్టం.

పదవిలో ఉండడమే ఆశయమైతే అది నీచం; ఆశయాలను వదిలి పదవిని పట్టుకోవడం నీచాతినీచం.ఆశయంకోసం పదవిని వదిలిపెట్టడం త్యాగమైతే, ఆశయాలను కూలదోసుకోవడానికే పదవిని వదిలిపెట్టడం ఘోరమని ఆయన స్పష్టంగా ప్రకటించారు.

ముల్కీ నిబంధనలపై సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఏర్పడిన అనుమానాలు, భయాందోళనలు ఆయనను ఆలోచింపజేశాయి. ఆంధ్రుల హక్కులకు నష్టం జరుగుతోందన్న

భావన ఆయనను కదిలించింది. అయినా సమస్యకు పరిష్కారం విభజనే అన్న భావనతో ఆయన ఏనాడూ ఏకీభవించలేదు.

కృత్రిమ ఆవేశంలో కొట్టుకుపోతున్న జనవాహినిని ఆయన మనోధైర్యంతో ఎదుర్కొన్నారు. నెలల తరబడి కుటుంబం గృహనిర్బంధంలో గడిపింది. భౌతిక దాడులకు మూకలు తెగబడ్డ సందర్భాలున్నాయి. అయినా ఆయన చలించలేదు.

తెలిసే ప్రమాదాన్ని ఆహ్వానించుకున్న నిర్ణయం అది.

కాలప్రవాహానికి ఎదురీదడమే ఆయన ఎంచుకున్న మార్గం.

పదవులు, అధికారాలే గొప్పతనం అని ఆయన ఎప్పుడూ నమ్మలేదు. ఉన్నత పదవుల పట్ల ఆకాంక్ష లేదు; అధికార దాహం పట్ల అసహ్యం. పదవిలో ఉన్నా లేకున్నా జీవితం ఒకే బాటలో నడవాలన్నదే ఆయన విశ్వాసం. అధికారం ఎవరి స్వంతమూ కాదు...అది ప్రజల వారసత్వమని నమ్మి, అలాగే ప్రవర్తించారు.

అందుకే... ఆజన్మాంతం ఆయన సమైక్యవాదిగానే నిలిచారు.

ఒకసారి నిర్ణయం తీసుకుంటే ఆ తరువాత ఆయన్ని దాన్లోంచి మరల్చటం ఎవరితరమూ కాదనటానికి జై ఆంధ్ర ఉద్యమ వ్యతిరేకత, సమైక్యవాద దృఢత ఒక సాక్ష్యం.

ఇది వాదనకు సంబంధించినది కాదు, ఆత్మప్రబోధానికి సంబంధించిన అంశం. ఫలితాన్ని దేవుడికి వొదిలేసి, నిర్ణయాన్ని కర్మసిద్ధాంతానికి అప్పగించే ఆలోచనలకు అయన వ్యక్తిత్వం ఏ మాత్రం అంగీకరించదు. ఈ అంశాన్ని మలేశియా ఆంధ్రసంఘం ప్రముఖుడు శ్రీ మదిని సోమినాయుడు గుర్తించారు. ఆయన పరిశీలనలోఓ అద్భుత విషయం బైటపడింది: ఆయన ఇలా రాశారు:

"నాకు రెండుసార్లు అవనిగడ్డలోని ఆయన స్వగృహాన్ని చూడటానికీ, రెండుసార్లు హైదరాబాద్‌లోని ఆయన నివసించు శాసనమండలి సభ్యుల వసతి గృహాన్ని చూడటానికి అవకాశం లభించింది. ఆ యిండ్లలోని చాలా భాగాలు పరీక్షించి చూశాను. గాని ఎక్కడా ఒక దేవుని చిత్రపటమో, శిల్పమో ఉండటమో, వాటికి పూజాపునస్కారాలు చేయటమో నాకు కనిపించలేదు. మారుగా ప్రతిరోజు ఉదయం లేచి కాలకృత్యాలు అయిన తర్వాత స్నానం చేసిన వెంటనే ఒక మూలకు వెళ్ళి ఏదో ధ్యానం చేసి పూలు వేయటం ఒక రోజు చూశాను. ఎవరికీ ధ్యానం అని పరికించగా, ఆ మూలలోని గౌతమబుద్ధుని ఛాయాచిత్రమును, గాంధీ మహాత్ముని ఛాయాచిత్రమును ఉండటం చూచి ఆశ్చర్య పోయాను. మండలిగారు నా స్తికులు కారు. దైవమ్మకం గలవారు. "మానవ సేవయే మాధవసేవ" అన్న సిద్ధాంతం గల వ్యక్తి" అని!

"శ్రీ మండలిగారు ప్రశాంతమూర్తి, గాంధేయవాది. తలంచిన కార్యం జయమయే వరకు సుఖమును, నిద్రను, అన్నాహారాలను లెక్కచేయని త్యాగమూర్తి. గొప్పలు చెప్పుకోటం, ఆడంబరంగా ఉండుట అసలే నచ్చని వారు. తాను ఎంత గొప్ప నాయకుడుగా, మంత్రిగా, శాసనసభ్యునిగా ఉన్నప్పటికీ సాధారణ ప్రజలతో కలిసిపోవటం ఆయనకు చాలా యిష్టం" అని వ్యాఖ్యానిస్తారాయన!

విద్యాశాఖ బాధ్యతలు

రాష్ట్రపతి పాలన అనంతరం ఏర్పడిన శ్రీ జలగం వెంగళరావుగారి మంత్రివర్గంలో నేను ప్రమాణ స్వీకారం చేసిన అరగంటలోపే విద్యాశాఖ బాధ్యతలు నాకు అప్పగించ బడ్డాయన్న సమాచారం తెలిసింది. ఆ వార్త విన్న క్షణంలో నా మనస్సులో మొదట కలిగిన భావన! ఈ బాధ్యతను నేను నిర్వహించగలనా? అనే సందేహమే.

"విద్యారంగానికి సంబంధించిన గొప్ప పండితుడనో, మేధావినో అని నేను ఎప్పుడూ నన్ను నేను భావించలేదు" అని ఆ మధురక్షణాల ఉద్వేగాన్ని శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు స్వయంగా వ్రాసుకున్నారు.

అంతకు ముందు శ్రీ పి.వి. నరసింహారావుగారి మంత్రివర్గంలో పనిచేసినప్పుడు, తాను స్వయంగా సాంఘిక సంక్షేమ శాఖనే కోరుకున్నానని ఆయన స్పష్టంగా చెప్పారు. అప్పట్లో ముఖ్యమంత్రి గారు నీటిపారుదల వంటి పెద్ద శాఖను ఇవ్వాలనుకున్నప్పటికీ, తన రాజకీయ జీవితం మొత్తం బలహీన వర్గాల సంక్షేమానికే అంకితమైందని, ఆ వర్గాల ఆర్థిక–సామాజిక స్థితిని కొంతైనా మెరుగుపరచాలన్నదే తన ప్రధాన ఆశయమని ఆయన వివరించారు. ఈ ఎంపిక తన అభిమానుల్లో కొంత నిరాశ కలిగించినా, తాను నమ్మిన మార్గాన్నే ఎంచుకున్నానని ఆయన నిస్సంకోచంగా పేర్కొన్నారు.

ఈ సందర్భంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకాశంగారు ఉన్న కాలంలో, సాంఘిక సంక్షేమ శాఖను సమర్థంగా నిర్వహించిన దళిత నాయకుడు వేముల కూర్మయ్యగారి సేవలు ఆయన మనసులో మెదిలి ఉండవచ్చునని అనిపిస్తుంది. వేముల కూర్మయ్యగారు కూడా కృష్ణాజిల్లాకు చెందిన నాయకుడే.

తాను కోరుకున్నట్టే, కృష్ణారావుగారికి సాంఘిక సంక్షేమం–మత్స్య పరిశ్రమ శాఖలు కేటాయించబడ్డాయి. ఆ కాలంలో బలహీన వర్గాలకు నిజంగా ఉపయోగపడేలా కొన్ని సంస్థాగత, పరిపాలనా మార్పులు తీసుకురావడానికి ఆయన నిజాయితీగా ప్రయత్నించారు. ఆ నేపథ్యమే, వెంగళరావుగారు అప్పగించదలచిన విద్యాశాఖ పట్ల ఆయనలో కొంత అనాసక్తిని కలిగించింది.

"నా ఆసక్తి, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మళ్లీ అదే శాఖలు నాకు అప్పగిస్తారని భావించాను. విద్యాశాఖ వంటి క్లిష్టమైన, భారమైన శాఖను నిర్వహించాలంటే విద్యావేత్తలు, మేధావులు, ప్రముఖ ఉపాధ్యాయులతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఆ బాధ్యతకు నేను తగినంతగా సిద్ధంగా లేనని ముఖ్యమంత్రి గారికి నిస్సంకోచంగా చెప్పాను. నిజం చెప్పాలంటే, ఆ బాధ్యత నా సామర్థ్యానికి మించినదేననే భావన నాకు కలిగింది" అని ఆయన నిజాయితీగా అంగీకరించారు.

అయితే, విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన తన మొదటి కర్తవ్యంగా విద్యార్థుల్లో మార్పు తేవడానికే ప్రయత్నించారు. అప్పటి తన అనుభవాలను ఆయన ఇలా వ్రాశారు...

"కష్టపడి చదవకపోతే పరీక్షల్లో ఉత్తీర్ణులం కాలేమని విద్యార్థులు గ్రహించారు. చదువుల పట్ల తిరిగి శ్రద్ధ వహిస్తున్నారు. దీనితో విద్యార్థులపై నాకు ఉన్న విశ్వాసం మరింత బలపడింది. వీరిని సక్రమంగా తీర్చిదిద్దితే, ఉత్తమ పౌరులుగా వికాసం చెందగలరన్న నమ్మకం నాలో పెరిగింది.

ఉపాధ్యాయుల్లో కూడా ఆత్మవిశ్వాసం ఏర్పడింది. దౌర్జన్య ప్రవృత్తిగల విద్యార్థులు పరీక్షా కేంద్రాలలో బెదిరిస్తారన్న భయం ఇప్పుడు లేదు. పరీక్షల్లో ఉత్తీర్ణత తమ తెలివితేటలపైనే ఆధారపడుతుందని విద్యార్థులు తెలుసుకున్నారు. అందుచేత ఉపాధ్యాయులు సమర్థవంతంగా బోధించాలని వారు కోరుతున్నారు. ఇది హర్షణీయమైన పరిణామం."

మాస్ కాపీయింగ్, మార్కుల కుంభకోణాలు వంటి అవకతవకలతో కలుషితమైన విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయడమే ఆయన విద్యామంత్రిత్వానికి కేంద్రబిందువుగా నిలిచింది. విద్యను పరీక్షల ఆటగా కాకుండా, విలువల నిర్మాణ ప్రక్రియగా మలచాలన్న దృష్టితో ఆయన అడుగులు వేశారు!

ఉపాధ్యాయుల సంక్షేమ నిధి

సేవలో ఉన్న ఉపాధ్యాయులు, పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులు, అలాగే మరణించిన ఉపాధ్యాయులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు నిరుపేద స్థితిలో ఉన్నట్లయితే, వారికి జాతీయ ఉపాధ్యాయ సంక్షేమ నిధి (ఆంధ్రప్రదేశ్) ద్వారా ఆర్థిక సహాయం అందే విధంగా చర్యలు తీసుకున్నారు.

1973–75 సంవత్సరాల మధ్య కాలంలో 15,000 మంది ఉపాధ్యాయులు మరియు వారి ఆధారితులకు మొత్తం రూ. 5.4 లక్షల ఆర్థిక సహాయం అందించబడినట్టు మండలి వెంకట కృష్ణారావుగారు తన విద్యామంత్రి అనుభవాలలో స్వయంగా వ్రాశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకే కాకుండా, ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకూ ఆయన ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఆ దిశగా 1975లో 'ప్రైవేటు విద్యాసంస్థల క్రమనిర్వహణ చట్టం' తీసుకురాబడింది. ఈ చట్టం 1974 అక్టోబరు 9వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ చట్టం ద్వారా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వర్తించే ఉద్యోగ నియమ నిబంధనలు స్పష్టంగా నిర్వచించబడ్డాయి. అంతేకాదు, రాష్ట్రంలోని గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వానికి తగిన నియంత్రణ ఉండేలా కూడా ఈ చట్టం ఏర్పాట్లు చేసింది.

ఇలా, విద్యారంగంలో ఉపాధ్యాయుల భద్రతను సంస్థాగతంగా పరిరక్షించిన సంస్కరణగా ఈ చట్టం నిలిచింది.

ప్రాథమిక విద్యపైన దృష్టి

1974–75 సంవత్సరాలలో విద్యా ప్రవేశాల గణాంకాలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 50,000 మంది మాత్రమే చేరగా, ఉన్నత ప్రాథమిక, మాధ్యమిక స్థాయిల్లో ఒక్కో దశలో సుమారు 6,000 మంది చొప్పున మాత్రమే వృద్ధి కనిపించింది. దీనికి విరుద్ధంగా, డిగ్రీ కళాశాలల్లో మాత్రం 35,000 మంది చేరారు.

ఉన్నత విద్య అవసరం అనివార్యమైనదే అయినా, సమాజానికి పునాది అయిన ప్రాథమిక విద్యకు ఇంకా ఎక్కువ శ్రద్ధ అవసరమని మండలి వెంకట కృష్ణారావుగారు స్పష్టంగా గుర్తించారు.

ఈ లోటును పూడ్చేందుకు కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో 6--14 ఏళ్ల వయస్సు పిల్లల కోసం అనౌపచారిక విద్యా కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి జిల్లాలో 150 కేంద్రాలు ఏర్పాటు చేసి, మొత్తం మీద సుమారు 3,000 మంది పిల్లలకు విద్యా లబ్ధి కల్పించారు.

అదే సమయంలో, 7వ, 10వ తరగతి పరీక్షల అర్హత నిబంధనలను సడలించారు. ఐదవ ఐదేళ్ల ప్రణాళిక కాలంలో శిక్షణ సంస్థలను పునరుజ్జీవింపజేశారు. అలాగే హైదరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల్లోని 400 గ్రామాల్లో ఉపగ్రహ టీవీ ప్రసారాల ద్వారా బోధనా ప్రమాణాలను మెరుగుపరిచే ప్రయోగాత్మక కార్యక్రమాన్ని అమలు చేశారు.

నివాస పాఠశాలల విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాల నుంచి ప్రోత్సాహం పొందుతూ, కిన్నెరసాని డ్యామ్ సమీపంలో గిరిజన పిల్లల కోసం ఒక నివాస పాఠశాల, అలాగే నాగార్జునసాగర్‌లో బాలుర జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. వృత్తిపర

విద్యలో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ కల్పించే విధానాలు కూడా ప్రవేశపెట్టారు. ఈ అన్ని చర్యలను సమీక్షిస్తూ, తన విద్యామంత్రిత్వ శాఖ రెండేళ్ల కాలంలో జరిగిన కార్యాచరణను ఆయనే ఒక వ్యాసంలో వివరించారు.

అయితే, ఆర్థిక పరిమితుల కారణంగా కొన్ని సంస్కరణలను వెంటనే అమలు చేయలేకపోయామని కూడా ఆయన నిజాయితీగా అంగీకరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో అప్పటికే దాదాపు ఐదో వంతు విద్యారంగానికే కేటాయించబడింది. ఈ సంస్కరణల వల్ల సంవత్సరానికి సుమారు రూ. 1.5 కోట్ల అదనపు వ్యయం ఏర్పడింది. అయినా ముఖ్యమంత్రిని ఒప్పించి ముందడుగు వేశారు.

"ఉపాధ్యాయులు తమ పవిత్ర వృత్తిని కేవలం ఆర్థిక కోణంలో మాత్రమే చూడకూడదని నేను కోరాను" అని ఆయన అన్నారు. బోధన ఒక పవిత్ర ఆహ్వానం, సమాజ భవిష్యత్తును మలిచే మహత్తర బాధ్యత. ఉపాధ్యాయుల ఈ కీలక పాత్రను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కూడా గుర్తించి ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది.

అదే దిశగా, "ప్రైవేటు విద్యాసంస్థలలో ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత కోసం 1975లో ఒక చట్టాన్ని తీసుకువచ్చాం. ఇది 1975 అక్టోబర్ 9న అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ఉపాధ్యాయుల సేవా నిబంధనలను స్పష్టంగా నిర్దేశించి, అన్ని గుర్తింపు పొందిన విద్యాసంస్థలపై ప్రభుత్వ పర్యవేక్షణను కల్పించింది" అని ఆయన స్పష్టంగా వివరించారు.

చదువుల ప్రమాణాల్ని నిలబెట్టిన ఘనత

ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో సంవత్సరాలుగా పేరుకుపోయిన అవినీతిని ప్రక్షాళన చేస్తూ, మండలి వెంకట కృష్ణారావుగారు కఠినమైన, ధైర్యవంతమైన చర్యలు తీసుకున్నారు. పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత కోసం స్పాట్ వాల్యుయేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయుల గౌరవం–భద్రతలను దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వేతన స్కేలులను అమలు చేశారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై సమర్థ నియంత్రణ సాధించేందుకు ప్రత్యేక విద్యా బిల్లును తీసుకువచ్చారు. మున్సిపల్ ఉపాధ్యాయుల జీతభత్యాల కోసం ప్రత్యేక నిధులను కేటాయించి, వారి ఆర్థిక అస్థిరతకు పరిష్కారం చూపారు.

"టీచర్స్ డే"ను 'గురుపూజా దినోత్సవం'గా మలచి, ఉపాధ్యాయ వృత్తికి సామాజిక గౌరవాన్ని మరింత పెంచారు.

పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మాధ్యమిక, ఉన్నత విద్యలకు వేర్వేరు డైరెక్టరేట్లను, అలాగే ప్రాథమిక విద్యకు అదనపు డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. ఉన్నత విద్య విస్తరణలో భాగంగా డిగ్రీ కళాశాలల్లో పీజీ విభాగాలను, సాంకేతిక విద్యాభివృద్ధికి పాలిటెక్నిక్ కళాశాలల్లో కొత్త కోర్సులను ప్రారంభించారు.

ఈ సమగ్ర సంస్కరణలను తలచుకుంటూ ఆయన సంతృప్తిగా ఇలా అన్నారు... "గత రెండు సంవత్సరాలలో సాధించిన వాటిలో ఇది ఒక ఘనవిజయం అని మనవి చేస్తున్నాను."

విద్యపై ఆయన నమ్మకం అచంచలమైనది:"ఆదర్శ పౌరులుగా విద్యార్థులు వర్ధిల్లడానికి ఉత్తమ విద్యావిధానం ఒక్కటే మార్గం. క్రమశిక్షణ, కార్యతత్పరత, సామాజిక బాధ్యతావగాహన... ఇవే విద్య యొక్క అసలైన లక్ష్యాలు." అని!

విద్యారంగ సంస్కరణలు

"1974 నాటి కరువుభత్యాన్ని చేర్చిన వేతన స్కేళ్లను ఉపాధ్యాయులందరికీ మంజూరు చేయడం జరిగింది. అదే విధంగా తాత్కాలిక కరువుభత్యాన్ని కూడా అన్ని యాజమాన్యాల పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులకు వర్తింపజేశారు. 1975 ఏప్రిల్ 1వ తేదీ నుంచి వివిధ వర్గాలకు చెందిన ప్రభుత్వేతర సంస్థలలో పింఛను పొందుతున్న ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించబడ్డాయి.

ప్రభుత్వేతర పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సరళీకృత పింఛను నియమావళిని 1974 ఏప్రిల్ 1వ తేదీ నుంచే అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ చర్యలన్నీ ఉపాధ్యాయుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయి; తమ వృత్తిపట్ల అంకితభావాన్ని మరింత దృఢం చేశాయి" అని, విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఉపాధ్యాయ సంక్షేమం కోసం తాను చేపట్టిన చర్యలను మండలి వెంకట కృష్ణారావుగారు స్వయంగా వివరించారు.

అదే కాలంలో, కొత్త కళాశాలల ఏర్పాటుకే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అనుమతులు లభించని క్లిష్ట పరిస్థితుల్లోనూ, నాగార్జున, కాకతీయ విశ్వవిద్యాలయాల స్థాపనకు దోహద పడి విద్యావ్యాప్తికి బలమైన పునాది వేశారు. అలాగే కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ప్రతిపత్తిని కల్పించి, రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థను మరింత విస్తృతం చేశారు.

భాషా సంకల్పం కావాలన్నారు!

తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వడం విద్యామంత్రికి కనీస బాధ్యతగా శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు గుర్తించారు. విద్యావ్యవస్థ కేవలం బోధనాయంత్రంలా కాక, జీవనీయ విలువలను నిర్మించే సాంస్కృతిక తంత్రంలా ఉండాలి అని కలలు కన్న చదువుల మంత్రి ఆయన.

తెలుగు భాషకు అధికారికమైన ఆయువును పోశారు; పాఠశాలల శుద్ధికి తపస్సు చేశారు; చదువుల రంగం పునర్నిర్మాణం కోసం నిరంతరం తపన పడ్డారు.

ఆయన స్థాపించిన అధికార భాషా సంఘం, అంతర్జాతీయ తెలుగు కేంద్రం నేడు సుషుప్తిలో ఉన్నాయి. వాటిని మళ్లీ చైతన్యపరచాలి. వివిధ అకాడెమీల ఆశయాలు నెరవేరేలా వాటికి ప్రాణప్రతిష్ఠ చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీ మండలి ప్రతీకగా నిలిచారు.

అధికార భాషాసంఘానికి ఆకృతి కల్పించారాయన!

1973 డిసెంబరు 10 నుంచి 1978 మార్చి 6 వరకూ...పవర్‌ఫుల్ ముఖ్యమంత్రిగా పేరొందిన శ్రీ జలగం వెంగళరావుగారి మంత్రివర్గంలో, ఆయన ప్రత్యేక వత్తిడిపైన విద్యాశాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు తెలుగు చదువులకు కొత్త దారులు తెరిచారు.

కవులకు సన్మిత్రుడై, కళాకారులకు ఆత్మబంధువై, సాహితీవేత్తలకు హృదయసఖుడై... విద్యా... సాంస్కృతిక మంత్రిగా మండలి వెంకట కృష్ణారావుగారు అపర శ్రీకృష్ణదేవరాయుడిలా కొలువుదీరిన కాలమది. రాజకీయ రంగంలో ధీరోదాత్తుడు; సాహిత్య...సాంస్కృతిక లోకంలో ధీరలలితుడు. ప్రవాసాంధ్రుల హృదయాల్లో శాశ్వత ప్రతిబింబంగా నిలిచిన నాయకుడాయన.

అంతకు మునుపు శ్రీ పి.వి. నరసింహారావుగారు ప్రారంభించిన తెలుగు భాషాభివృద్ధి పథకాల పునాదిపైన, మండలివారు నిర్మించినది ఒక సువర్ణగాథ. శ్రీ పీవీ న్యాయ శాఖామాత్యునిగా ఉన్న సమయంలో అధికార భాషా చట్టం ద్వారా భాషాభిమానులకు ఆయన ఇచ్చిన ప్రోత్సాహం అపూర్వమైనది.

1966 మే 14న అమలులోకి వచ్చిన అధికార భాషా సంఘం చట్టం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్యరూపం దాల్చేందుకు ఎనిమిది ఏళ్లు పట్టింది. మండలివారి చొరవతో, ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారి అనుమతితో అధికార భాషా సంఘం ఒక స్పష్టమైన ఆకృతి దాల్చింది. వావిలాల గోపాలకృష్ణయ్య తొలి అధ్యక్షుడిగా నియమితులై, తాలూకా స్థాయి వరకూ తెలుగు అధికార భాషగా ప్రవేశించి పరిపాలనలో స్థిరపడే దశకు చేరుకుంది.

గురుకుల పాఠశాలల రూపకర్త

నాగార్జునసాగర్‌లో స్థాపించిన గురుకుల జూనియర్ కళాశాల గ్రామీణ విద్యార్థుల ఆశలకు అడ్డుకట్టలు తొలగించి, ఐఏఎస్-ఐపిఎస్ శిఖరాలకు చేరువ చేసింది. దసరా సంధ్యలలో బాలల మహోత్సవాలు, ఆంధ్ర దర్శిని ద్వారా రాష్ట్ర దర్శనం, పల్లెల్లో నాటకాలు, కవి సమ్మేళనాలు...ఇవన్నీ ప్రజల్లో విజ్ఞాన వికాసానికి విత్తనాలయ్యాయి.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు

1974లో జలగం వెంగళరావుగారి ప్రభుత్వంలో విద్యా–సాంస్కృతిక శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు, శ్రీ పి.వి. నరసింహారావు ప్రారంభించిన భాషాభివృద్ధి యజ్ఞాన్ని అపార శ్రద్ధాసక్తులతో కొనసాగించారు. ఆ కాలం తెలుగు భాషా–సంస్కృతుల చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచింది...తెలుగు గడ్డపై వెలిగిన జ్ఞానదీపావళిగా విరాజిల్లింది.



శ్రీ పి.వి. నరసింహారావుగారి మానసపుత్రికగా భావించిన తెలుగు అకాడమీని మండలివారు సర్వాలంకార శోభితంగా తీర్చిదిద్దారు. తెలుగులో విద్య, తెలుగులో జ్ఞానం, తెలుగులోనే ఉన్నత విద్యా ప్రవాహం... అనే దృష్టిని కార్యరూపంలోకి తీసుకొచ్చిన కాలమది. మాతృభాష విద్యా విధానానికి సార్వత్రిక గౌరవం లభించిన అరుదైన ఘట్టమది.

1974, శ్రీ ఆనంద నామ సంవత్సర ఉగాది సందర్భంగా హైదరాబాద్ హృదయంలో నిర్వహించిన అఖిల భారత తెలుగు సాంస్కృతిక ఉత్సవాలు, మండలి వెంకట కృష్ణారావుగారి సాంస్కృతిక సేవాపథంలో ఒక మహత్తర మలుపుగా నిలిచాయి. దేశమంతటా నుంచి తెలుగు పెద్దలు చేరి, సాహిత్య–సాంస్కృతిక గీతాలాపనలో లీనమైన సమయం అది. అప్పటివరకు వేర్పాటువాద భావనలు, పరస్పర అపనమ్మకాలు చీల్చిన తెలుగు హృదయాలకు ఈ ఉత్సవాలు అపూర్వమైన సాంత్వనను అందించాయి.

ప్రపంచ తెలుగు మహాసభలకు స్రష్ట, ద్రష్ట అయిన వ్యక్తి మండలి వెంకట కృష్ణారావుగారే.

1975 ఏప్రిల్ 11 నుండి 18 వరకు హైదరాబాద్‌లో వైభవోపేతంగా నిర్వహించిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు...తెలుగు చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచాయి. 16 దేశాల నుంచి 92 మంది ప్రతినిధులు, ఇతర రాష్ట్రాల నుంచి 921 మంది, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 4,439 మంది ప్రతినిధులు పాల్గొనగా...అందరికీ ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం ఆయన విశాల దృష్టి, నిర్వాహక సామర్థ్యానికి నిదర్శనం.

యునెస్కో ప్రతినిధి, కాశ్మీర్ ముఖ్యమంత్రి షేక్ అబ్దుల్లా దంపతుల పాల్గొనడం సభలకు అంతర్జాతీయ కాంతిని చేకూర్చింది. ప్రతిరోజూ సుమారు రెండు లక్షల మంది సందర్శకులు, సాంస్కృతిక గోష్ఠులు, మేధో చర్చలు, కళా ప్రదర్శనలు...హైదరాబాద్ నగరాన్ని మొత్తం తెలుగు సంస్కృతి పరవశింపజేసిన రోజులవి.

హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన "తరతరాల తెలుగు జాతి ప్రదర్శన" 2,500 సంవత్సరాల తెలుగు చరిత్రను కళ్లకు కట్టినట్లుగా ఆవిష్కరించి, ప్రతి సందర్శకుని హృదయంలో జాతి గర్వగీతాన్ని ఆలపింపజేసింది...

తరతరాల తెలుగుజాతి మ్యూజియం

ప్రపంచ తెలుగు మహాసభల వైభవోత్సవంలోనే "తరతరాల తెలుగు జాతి" మ్యూజియం ఏర్పాటుకు నడుం కట్టారు. అది కేవలం ఒక ప్రదర్శనశాల కాదు...తెలుగు జాతి గౌరవగాథలు, మహోన్నత కీర్తి-ప్రతిష్ఠలు ప్రతిధ్వనించే ఒక జీవంత స్మృతిమందిరం. తరతరాలుగా నిర్మితమైన తెలుగు సంస్కృతీ చైతన్యానికి అది దృశ్యరూపంగా రూపొందాలని శ్రీ మండలి కలలు కన్నారు. కానీ దురదృష్టవశాత్తూ ఆయన కల కలగానే మిగిలింది.

తెలుగు చరిత్ర, భాష, సాహిత్యం, లిపి, ఆచారాలు, కళలు, సంస్కృతి, వేషధారణ, పనిముట్ల పరిణామక్రమం...ఈ సమస్తాన్ని ఒకే చోట సమగ్రంగా సమకూర్చి, శాస్త్రీయంగా పరిరక్షించాలన్న శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి సంకల్పం, ఒక మహోన్నత సాంస్కృతిక యజ్ఞంగా అవతరించిప్రజల్లో భాషాసాంస్కృతిక అవగాహనను విస్తరింపజేసి, తెలుగు జాతి సమగ్రత పట్ల గర్వబోధను బలపరచాలని ఆశించారు.

హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో మూడు ఎకరాల విస్తీర్ణంలో, 1975 సెప్టెంబర్ 13న భారత రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగడంతో, ఆ మహాసంకల్పానికి దృఢమైన పునాది వేశారు.

సంగీతం, నృత్యం, లలితకళల వికాసానికి విస్తృత మార్గాలను తెరచడమే కాక, తెలుగు ప్రజల సమగ్ర చరిత్రను పునర్నిర్మించాలన్న దీర్ఘదృష్టితో డా. ఎన్.రమేశన్ ఆధ్వర్యంలో ఒక పరిశోధనా కమిటీ ఏర్పాటు చేశారు.

ఈ క్రమంలోనే "A Comprehensive History of Telugu Speaking People" అనే మహత్తర పరిశోధన ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. దాదాపు రూ. 15 లక్షల వ్యయంతో ప్రారంభమైంది!తెలుగుజాతి చరిత్రను భావోద్వేగాలకే పరిమితం కాకుండా, శాస్త్రీయ ప్రమాణాలతో లిఖిత రూపంలో స్థిరపరచాలన్న సంకల్పాన్ని కూడా తరువాత వచ్చిన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లలేదు.

1975 తెలుగు సాంస్కృతిక సంవత్సరం

ప్రపంచ తెలుగు మహాసభల అపూర్వ విజయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ వైషమ్యాలు క్రమంగా తగ్గి, పరస్పర అవగాహన-శాంతి వాతావరణం నెలకొంది. ఈ అనుభవం, ప్రాంతీయతకు విరుగుడు మంత్రంగా రాజకీయ పరిష్కారాలకన్నా సాంస్కృతిక బంధమే అత్యంత ప్రభావవంతమన్న భావనను ప్రజలందరిలో బలంగా స్థాపించింది. అందుకే,

సాంస్కృతిక సమన్వయాన్ని సామాజిక ఐక్యత సాధనగా ఉపయోగించాలన్న ఆలోచనకు అన్ని వర్గాల నుంచి విశాలమైన సమర్థన లభించింది. ఈ దృష్టిలో శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారికీ, ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారికీ సమగ్ర ప్రజామద్దతు దక్కింది.

ఈ సాంస్కృతిక ఉత్సాహాన్ని కేవలం ఒక మహాసభ విజయంగా పరిమితం చేయకుండా, దీర్ఘకాలిక సామాజిక ఉద్యమంగా మలచాలన్న సంకల్పంతో ప్రభుత్వం 1975 సంవత్సరాన్ని "సాంస్కృతిక సంవత్సరం"గా ప్రకటించింది. ప్రభుత్వ స్థాయిలో రూపుదిద్దుకున్న సాంస్కృతిక విధానాలు కాగితాలకే పరిమితం కాకుండా, ప్రజాజీవితంలోకి ప్రవేశించాలన్న ఉద్దేశంతో జిల్లా స్థాయి, పురపాలక సంఘాల స్థాయి, తాలూకా స్థాయి వరకు సాంస్కృతిక కమిటీల ఏర్పాటును ప్రతిపాదించారు.

ఈ కమిటీలకు కలెక్టర్, డి.ఆర్.ఓ., తహసీల్దార్ స్థాయి అధికారులు నాయకత్వం వహించగా, వారితో పాటు రచయితలు, కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తలు సభ్యులుగా భాగస్వాములయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు, ప్రతిభను గుర్తించి పురస్కారాలు, ప్రోత్సాహకాలు అందించే బాధ్యత కూడా ఈ కమిటీలకే అప్పగించబడింది.

సాహిత్య–సాంస్కృతిక వైభవాన్ని రాజధానులు, మహానగరాలకే పరిమితం చేయకుండా, గ్రామ స్థాయికి తీసుకువెళ్లాలన్న ఈ ఆలోచన...మండలి వెంకట కృష్ణారావుగారి సాంస్కృతిక దృష్టి ఎంత లోతైనదో, ఎంత ప్రజాస్వామ్యమయినదో వెల్లడించే అద్భుత ఉదాహరణగా నిలుస్తుంది.

స్థిరరూపం దాల్చిన ఉత్సాహం

తెలుగువారిలో రేకెత్తిన ఆ అపూర్వ ఉత్సాహం క్షణిక అలలా మాయమవకూడదని, దానికి స్థిరమైన రూపం కల్పించాలనే దూరదృష్టితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యాచరణకు దిగింది. భావోద్వేగంగా మొదలైన చైతన్యాన్ని వ్యవస్థాత్మకంగా మలచడం...సాంకేతికత, వ్యూహం కలిపిన విజ్ఞతా నిర్ణయంగా నిలిచింది.

దేశాంతరాలనుంచి వచ్చిన సోదరాంధ్రులతో అవిచ్ఛిన్నమైన సాంస్కృతిక బంధాలను కొనసాగించాలన్న సంకల్పంతో పలు వ్యవస్థలు ఆవిర్భవించాయి. ప్రవాసాంధ్రుల విద్యా–సాంస్కృతిక సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు సచివాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, దాని నిర్వహణకు ప్రతి ఏటా పదిలక్షల రూపాయలను కేటాయించడం... ప్రభుత్వ దూరదృష్టికి సాక్ష్యం!

అప్పటికి ఉన్న వివిధ అకాడెమీల నిధులను ఒక లక్ష నుంచి మూడు లక్షలకు పెంపు చేయటం, అదనంగా బాలల అకాడెమీ, ఫొటోగ్రఫీ అకాడెమీల ఏర్పాటు, జానపద కళలను ప్రోత్సహించేందుకు అఖిలభారత జానపద కళామహోత్సవాల నిర్వహణ, ప్రతి

ఏడాది ఉగాది పండుగను సాంస్కృతిక ఉత్సవంగా ప్రభుత్వపరంగా నిర్వహించడం, వృద్ధ కళాకారులకు పెన్షన్ లేదా గౌరవభృతి పెంపు... ఇలాంటి చర్యలతో ఉత్సాహాన్ని కేవలం ఒక ఉత్సవంగా కాకుండా, వ్యవస్థగా మలిచే ప్రయత్నం జరిగింది.

ఈ చర్యలు తెలుగు సాంస్కృతిక చైతన్యానికి దృఢమైన పునాది వేయటానికి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి విద్యా-సాంస్కృతిక మంత్రిత్వ శాఖ చేసిన అపూర్వ కృషిగా చరిత్రలో నిలిచాయి. భావనకు కార్యరూపం ఇచ్చిన చారిత్రక అడుగు!

తెలుగు భాషా-సాంస్కృతిక అవగాహనను ప్రతిపాదన నుండి వ్యవస్థకు తేవడంలో అత్యంత ప్రభావవంతంగా నిలిచింది..

సాంస్కృతిక వ్యవహారాల శాఖకు డైరెక్టరేట్ స్థాయి:

సెక్రటేరియట్‌లో చిన్న శాఖగా ప్రారంభమైన సాంస్కృతిక శాఖను డైరెక్టరేట్ స్థాయికి చేర్పించడం మాత్రమే కాదు, దానికి స్వతంత్ర నిర్వహణా వేదిక ఇవ్వడం శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి దూరదృష్టి ప్రతిఫలమే.

డైరెక్టరేట్ సంచాలకుడి పదవి డెప్యూటీ సెక్రటరీ స్థాయిగా నిర్ణయించడం ద్వారా సాంస్కృతిక రంగానికి అత్యవసరమైన అధికారిక స్థిరత్వం లభించింది.

ఈ స్థిరత్వం కవులు, కళాకారులు, రచయితలు, సాంస్కృతిక పరిశోధకులకీ, అలాగే ప్రజలకీ ప్రభుత్వంతో సంపర్కం సాధించే ఒక సాంకేతిక కేంద్రంని కలిగించింది.

ఈ కేంద్రం ద్వారా రాష్ట్రంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణ వ్యవస్థాగతమైంది. ఉగాది, దసరా, సంక్రాంతి వంటి సాంప్రదాయ పండుగలను, జానపద కళా మహోత్సవాలను, కల్చరల్ ప్రదర్శనలు, సాహితీ సమ్మేళనాలను నియమితంగా ప్రణాళికా ప్రకారమే నిర్వహించడం మొదలైంది.

కేవలం ఉత్సవాలుగా కాకుండా, ప్రజల్లో భాషా-సాంస్కృతిక అవగాహన పెంపుకు వీలు కలిగే విధంగా ఏర్పాట్లు చేశారు.

ప్రవాసాంధ్రుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం, ప్రతి ఏటా కొంత నిధిని వాటి నిర్వహణకు కేటాయించడం, వృద్ధ కళాకారులకు గౌరవ భృతి లేదా పెన్షన్ విధించడం వంటి ధృడమైన విధానాలు ఈ విభాగాన్ని కేవలం నిబంధనల పట్టికలుగా కాకుండా, సాంస్కృతిక ప్రేరణ కేంద్రంగా మార్చాయి.

అంతకు పూర్వం ఉన్న సాహిత్య, సంగీత, నాటక, లలితకళా అకాడెమీలకు అదనంగా బాలల అకాడమీ, ఫొటోగ్రఫీ అకాడమీల రూపకల్పన, తెలుగు అకాడెమీని స్థిరీకరించటం, జానపద కళలను ప్రోత్సహించడానికి అఖిలభారత జానపద కళా మహోత్సవాల ఏర్పాటు,

ప్రతి ఏడాదీ ఉగాది పండుగను సాంస్కృతిక ఉత్సవంగా నిర్వహించడం... ఇలాంటి పలు ప్రయత్నాల ద్వారా సాంస్కృతిక వైభవాన్ని గ్రామాల స్థాయికి చేరవేయడం సాధ్యమైంది.

ఈ విధంగా, ప్రజలలో భాష సాంస్కృతిక చైతన్యాన్ని స్థిరంగా నిలిపి ఉంచే దృఢమైన పునాది ఈ విధంగా ఏర్పడింది. మునుపటి క్షణిక ఉత్సాహాలను వ్యవస్థాత్మక చరిత్ర రూపంలోకి మార్చడం... ఇది నిజంగా ఒక చారిత్రక అడుగు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక విస్తరణలో అద్భుత దృష్టాంతం.

గురుపూజోత్సవం

ప్రతి సంవత్సరం, భారత రాష్టపతిగా ఉన్న శ్రీ రాధాకృష్ణన్ గారి పుట్టినరోజును "ఉపాధ్యాయదినం"గా గౌరవించడం భారతీయ సాంప్రదాయం. అయితే, తెలుగు భాషలో 'దినం' అనే పదానికి కొంత సాధారణ, సాధ్యంగా చెడు అర్థముందో, ఇది ఉపాధ్యాయుల పవిత్రతను పూర్తిగా వ్యక్తం చేయలేకపోవటం శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారికి బాధ అనిపించింది. ఆయన ఈ పర్వాన్ని భాషా-సాంస్కృతిక దృక్కోణంలో సుసంస్కృతమైన రీతిలో ఉంచాలని నిర్ణయించుకున్నారు.

అందుకు తగిన పేరు ఎంచుకోవడానికి, ఆయన సమకాలీన ప్రముఖులు శ్రీ పి.ఎస్.ఆర్. అప్పారావు, శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి గార్లతో చర్చించారు. వారి సలహా ప్రకారం, 'ఉపాధ్యాయ దినం'ను "గురుపూజోత్సవం" అని పిలవడం ఉత్తమమని అంగీకరించారు. గురుపూజ ఈ సమ్మేళనం ఉపాధ్యాయుల పవిత్రత, సమర్పణ భావనను తెలుపుతూ, వారు విద్యార్థుల జీవితాల్లో స్ఫూర్తి కేంద్రంగా ఉన్నారని సూచిస్తుంది.

అంతేకాక, ఈ మార్చిన పేరు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ప్రత్యేకంగా పాటించబడుతుంది. ముద్రగా, పేరుతో, భావనతో, ఈ "గురుపూజోత్సవం" రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల గౌరవానికి మరియు విద్యా సమాజానికి ఒక స్థిరమైన గుర్తుగా నిలిచింది.

బాలల అకాడెమీ నిర్మాణం

1976 మార్చి, ఆంధ్రప్రదేశ్‌లో బాలలకోసం ఒక మహత్తర దశార్పణ...బాలల అకాడమీ స్థాపన...శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి దృఢసంకల్పానికి ప్రతిబింబం. సంగీతం, సాహిత్యం, నాటకం, చిత్రలేఖనం వంటి కళలకు ఇప్పటికే అకాడమీలు ఉన్నప్పటికీ, బాలల కళారంగానికి అంతర్గత, శాస్త్రీయంగా వ్యవస్థాపిత వేదిక లేని పరిస్థితి ఆయనను తరచుగా కలవరపెట్టేది. "బాల్యం తాత్కాలిక దశ కాదు; భవిష్యత్తు మూలాలు అక్కడే పాతుకుపోతాయి" అనే దృఢవిశ్వాసంతో, బాలలకోసం ప్రత్యేక అకాడమీ అవసరమని ఆయన నిశ్చయించారు.

ప్రాంతీయ, రాష్ట్రస్థాయి బాలసాహిత్య కార్యకర్తల సహకారంతో, ఈ ఆశయానికి మద్దతు ఏర్పడింది. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి ఆశీర్వాదం లభించకుంటే, బాలల అకాడమీ కేవలం ఆలోచనగా మిగిలిపోతుంది. "జవహర్ బాలభవనం ఉన్నా, అది కేవలం సౌకర్యం మాత్రమే; బాలల సాంస్కృతిక, విద్యా-వైజ్ఞానిక అభివృద్ధికి దిశానిర్దేశకంగా ఉండాలి" అనే ఆయన వాదనలు, సమయంతో, విశ్వాసంగా మారి స్థిరమయ్యాయి.

అంతిమంగా, 1976 మార్చిలో బాలల అకాడమీ శంకుస్థాపన జరిగి, వెంటనే కార్యక్రమాల రూపకల్పన ప్రారంభమైంది. హైదరాబాద్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల బాలసాహిత్య కార్యకర్తలను సమీకరించి, నిర్వాహక మండలి, కార్యవర్గాలను నెలకొల్పారు. స్వర్గీయ న్యాపతి రాఘవరావు దంపతులు తదితరులు కూడా శ్రద్ధ చూపి, కార్యక్రమాలు విజయవంతం కావడానికి తోడ్పడ్డారు.

కేవలం రాష్ట్రానికి పరిమితం కాకుండా, యావత్ భారతదేశంలోని తెలుగు బాలలను ఈ అకాడమీ గొడుగు నీడలోకి తీసుకురావాలని ఆయన సంకల్పించారు. అకాడమీ స్థాపన అనంతరం, ఒక ఏడాది లోపు "అఖిల భారత తెలుగు బాలల మహాసభలు" విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ప్రతిభా-పాటవ పోటీలు, కళారంగ ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, సాంస్కృతిక చర్చలు..ఇవన్నీ వేలాది బాలలు, తల్లిదండ్రులు, కార్యకర్తలను ఉత్సాహపరిచాయి.

ఈ మహాసభలు కేవలం సాంస్కృతిక వేడుకలే కాక, తెలుగు బాలల సృజనాత్మకత, సామాజిక-సాంస్కృతిక అవగాహన, భవిష్యత్తు విద్యాసంబంధ అభివృద్ధికు ఒక భిన్నమైన వేదికగా నిలిచాయి. సంగీతం, నాటకం, సాహిత్యం, చిత్రకళలో ప్రసిద్ధులైన ప్రముఖులు పాల్గొని మార్గదర్శక వచనాలు అందించడముతో, ఈ కార్యక్రమం ఒక సమగ్ర సాంస్కృతిక యజ్ఞంలా మారింది.

శ్రీ పి.ఎస్.ఆర్. అప్పారావు గారు వ్రాసినట్లుగా, "శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు బాలానంద సంఘంలో బాలుడుగా, లలిత కళా సమితిలో సర్వ కళాప్రియుడుగా, సాహితీ సమితిలో సాహితీ రసజ్ఞుడుగా ప్రత్యక్షమయ్యేవారు. ఆయన సమాజంలోని ప్రజ్ఞను గుర్తించి, దానిని సమర్థంగా ఉపయోగించే ప్రజ్ఞతో ప్రసిద్ధి చెందారు. రాజకీయవేత్తలు, అధికారులు, కళాకారులు, పండితులు...అందరూ ఆయన మిత్రులే."

ఈ క్రమంలో, బాలల అకాడమీ స్థాపన మరియు మహాసభల నిర్వహణ కృష్ణారావుగారి అవిరళమైన కృషి, దృఢసంకల్పం, సమన్వయశక్తికి సాక్ష్యంగా నిలిచిన చారిత్రక ఘట్టం. ఈ కృషి, తెలుగు బాలల సాంస్కృతిక చైతన్యానికి ఒక శాశ్వత పునాది వేసిన ఘనతగా భావించవచ్చు.

రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు...మలేషియా 1981

1981 ఏప్రిల్ 14, ఉగాది ఉదయాన, తెలుగు జ్యోతి మరోసారి వెలిగింది... మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో. మలేషియా ఆంధ్ర సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అంతర్జాతీయ తెలుగు సంస్థ...ఈ మూడు ప్రవాహాలు కలసి ఒక మహావాహినిగా మలేషియా తెలుగు ప్రజల హృదయాలను ముంచెత్తాయి.

సభకు ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య అధ్యక్షత వహించగా, మలేసియా ప్రధానమంత్రి మహతీర్ బిన్ మోహమ్మద్ ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆ మహాసభకు అంతర్జాతీయ వైభవాన్ని నింపారు. ఐదు రోజుల పాటు సాగిన మహాసభలో భారతదేశం నలుమూలల నుండి, అలాగే మారిషస్, ఫిజీ, దక్షిణాఫ్రికా, శ్రీలంకల నుండి కవులు, కళాకారులు, భాషావేత్తలు, పరిశోధకులు పాల్గొని తెలుగు మలేషియాను తెలుగు మయం చేశారు.

ఉదయం: చర్చలు, పరిశోధనల సమావేశాలు, మధ్యాహ్నం: కవి సమ్మేళనాలు, సాయంత్రం: సాంస్కృతిక ప్రదర్శనలు...తెలుగు కళాకారుల గానం, నృత్యం, మలేసియన్ కళాకారుల సౌందర్య ప్రదర్శనలు అలరించాయి.

భారత రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి తన సందేశంలో, “విదేశాలలో నివసిస్తున్న తెలుగు ప్రజల ప్రేమాభిమానాలకు ఋణం తీర్చుకోవాలి” అని అన్నారు.

ఈ మహాసభ విజయానికి శ్రీ మండలి వెంకట కృష్ణారావు, శ్రీ పి.ఎస్.ఆర్. అప్పారావు, శ్రీ సి. అప్పారావు, శ్రీ సోమయ్య నాయుడు, ఎ. అప్పన్న వంటి అనేక మూలకారకులు గణనీయమైన కృషి చేశారు.

ప్రత్యేకంగా, “తరతరాల తెలుగు వెలుగు” చాయాచిత్ర ప్రదర్శన, 2,500 సంవత్సరాల తెలుగు చరిత్రను ప్రతిబింబిస్తూ, తెలుగు జాతి గాథల గౌరవం, సాంస్కృతిక ఐక్యత, భాషా–సాహిత్య వారసత్వాన్ని ప్రతిధ్వనింపజేసింది.

ఈ మహాసభ, ప్రవాసాంధ్రుల సామాజిక–సాంస్కృతిక చైతన్యానికి శాశ్వత వేదికగా నిలిచింది. మలేషియాలోని తెలుగు సమాజానికి ఒక భావపూరిత సాంఘిక–సాంస్కృతిక గుర్తింపు కల్పించడం ద్వారా, ప్రపంచ తెలుగు భావాన్ని లోకానికి చాటింది.

3వ ప్రపంచ తెలుగు మహాసభలు–మారిషస్, 1990

రెండవ ప్రపంచ తెలుగు మహాసభల తీర్మానాలు, మూడవ మహాసభకు మార్గదర్శి అయ్యాయి. 1979–80 లో మారిషస్ లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్, మోకానగరం తెలుగు జాతి గౌరవానికి ప్రాముఖ్య వేదికగా నిలిచింది.

సభ ప్రారంభోత్సవంలో మారిషస్ గవర్నర్ జనరల్ సర్ వీరాస్వామి రింగడు, ప్రధాని సర్ అనిరుధ్ జగన్నాథ్ పాల్గొని, భారత్–మారిషస్ సత్సంబంధాల గాథను ప్రతిపాదిస్తూ ప్రసంగించారు. తెలుగు ప్రజల కృషి, భాషా–సంస్కృతిక సేవలను ప్రస్తావిస్తూ ప్రశంసించారు. ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి శ్రీ మండలిని ఘనంగా సత్కరించారు.

ఈ మహాసభకు ఆంధ్రప్రదేశ్ నుంచి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డా. సి. నారాయణ రెడ్డి నేతృత్వంలో విద్యావేత్తలు, మేధావులు, కవులు, కళాకారులు, నటులు, అధికారులు సమావేశమై సభను ఘనంగా నిర్వహించారు.

నాలుగు రోజుల ఉత్సవాల్లో మాతృభాష బోధన, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి గురించి విస్తృతమైన గోష్ఠులు జరిగాయి.

కవి సమ్మేళనాలు, ప్రతినిధుల సమావేశాలు తెలుగు గీతాన్ని మరింత గాఢతనిచ్చాయి. రెండు శతాబ్దాల క్రితం వివిధ ప్రాంతాల నుంచి పల్లెలో, పట్టణాల్లోకి చేరిన తెలుగు ప్రజలు తమ తాతముత్తాతల సంపదను భాషా–సంస్కృతిగా ఆరాధిస్తూ, తరతరాలకు అందిస్తూ, తెలుగు ఉనికిని నిలుపుతూ వస్తున్నారు. ఈ మహాసభలు ప్రవాసాంధ్రుల హృదయాల్లో తెలుగు మమకారాన్ని వెల్లువెత్తించాయి..

ప్రపంచ తెలుగు మహాసభలు : దీర్ఘకాల ప్రభావం

భాష–సంస్కృతి–జాతీయ చైతన్య పూరిత శంఖనాదంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు ఒక సాంస్కృతిక వేడుకగా మాత్రమే కాక, తెలుగు జాతి స్వీయచైతన్యాన్ని మలిచిన చారిత్రక మలుపుగా నిలిచాయి. అవి తక్షణ ఉత్సాహానికి పరిమితం కాకుండా, భాషా–సాంస్కృతిక రంగాలలో దీర్ఘకాల ప్రభావాన్ని సృష్టించిన నిర్మాణాత్మక ఉద్యమంగా మారాయి.

జాతి అవగాహనలో సంస్కరణాత్మక మార్పుని సాధించాయి. మహాసభలకు పూర్వం తెలుగు భాష–సంస్కృతి ప్రధానంగా ప్రాంతీయ భావనలోనే పరిమితమై ఉండేది. ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగు ఒక ప్రాంతీయ భాష మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్త సాంస్కృతిక గుర్తింపు కలిగిన జాతి భాష అనే భావనను స్థిరపరిచాయి.

భాషను కేవలం సంభాషణ సాధనంగా కాకుండా, ఒక చారిత్రక వారసత్వంగా, నాగరికతా ప్రవాహంగా చూడాలన్న దృష్టి ఈ మహాసభల ద్వారానే బలపడింది.

ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు ప్రజలకు ఈ మహాసభలు ఒక మానసిక కేంద్రం (cultural anchor)గా పనిచేశాయి. రాష్ట్రేతర, విదేశీ ఆంధ్ర ప్రజలలో మాతృభాష పట్ల గర్వం, బాధ్యత, అనుబంధం పెరిగింది. తదనంతరం ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన తెలుగు సంఘాలు, సాహిత్య వేదికలు, భాషా పాఠశాలలు...ఇవన్నీ ఈ మహాసభల ప్రభావంతో పుట్టిన సాంస్కృతిక ఉపఫలితాలే.

ప్రపంచ తెలుగు మహాసభలు రాష్ట్ర స్థాయి భాషా విధానాలపై గణనీయమైన ప్రభావం చూపాయి. తెలుగు అకాడమీవంటి సంస్థలకు స్పష్టమైన దిశ లభించింది.

మాతృభాషలో ఉన్నత విద్య సాధ్యసాధ్యతలపై చర్చలు ప్రారంభమయ్యాయి అధికార భాష అమలుకు సామాజిక మద్దతు పెరిగింది. భాషాభివృద్ధి ప్రభుత్వ దయాదాక్షిణ్యమేగాక, సామూహిక బాధ్యత అన్న భావన బలపడింది.

భాషోద్యమం అంటే, ప్రభుత్వానికి విజ్ఞాపన చేసుకోవటం అనే భావనలోంచి బయటకు వచ్చి, ప్రజలు భాషానురక్తిని పెంపు చేసుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పే ఒక సాధకంగా మారాయి.

సాంస్కృతిక ప్రజాస్వామీకరణ అనేది ప్రపంచ తెలుగు మహాసభల అసలు విజయంగా చెప్పాలి. అందుకు ప్రధాన కారకులు నిస్సందేహంగా మండలి వారే!

సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, జానపదం అన్నీ ఎలైట్ వేదికల నుంచి ప్రజావేదికల దాకా చేరాలన్న సందేశాన్ని మహాసభలు నిలబెట్టాయి.

పండితులు, కళాకారులు, సామాన్య ప్రజలు ఒకే వేదికపై భాగస్వాములవడం, సాంస్కృతిక ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేసింది. విభజన వాదాలు, భావోద్వేగ రాజకీయాల మధ్య, ప్రపంచ తెలుగు మహాసభలు సాంస్కృతిక సమైక్యతకు ప్రత్యామ్నాయ భాషను అందించాయి.

రాజకీయ సరిహద్దులకతీతంగా, భాష, సంస్కృతి ఆధారంగా జాతిని ఊహించు కోవచ్చున్న భావనను స్థిరపరిచాయి.

ప్రపంచ తెలుగు మహాసభల చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిన మూడు సభలు మండలి వెంకట కృష్ణారావుగారి ప్రేరణతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వయంగా నిర్వహించినవి.

ఈ చైతన్యంతో 2012లో తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 4వ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించింది. 2007లో శ్రీ బుద్ధప్రసాద్ పూనికతో కృష్ణాజిల్లా రచయితల సంఘం తొలి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించి, తెలుగును ప్రపంచ తెలుగుగా తీర్చిదిద్దే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది.

2011, 2015, 2019, 2021, 2024లలో వరుసగా ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించి భాషోద్యమాన్ని బలోపేతం చేసింది. కేవలం రచయితలు, భాషాభిమానుల అండదండలతో నిర్వహించిన సభలివి.

తదుపరి కాలంలో ప్రపంచ సభల ప్రేరణతో అనేక ప్రయత్నాలు జరగటం స్వాగతించదగిన విషయం. తమ సభలకు 'ప్రపంచ' అనే ఉపసర్గను చేర్చిన ఎవరికైనా మండలి వెంకట కృష్ణారావుగారి ప్రేరణే ప్రధానం అని భావించాలి!

కృష్ణాజిల్లా రచయితల సంఘం వ్యవస్థాపకులు శ్రీ మండలి

మండలి వెంకట కృష్ణారావుగారి మానసపుత్రిక కృష్ణాజిల్లా రచయితల సంఘం. కృష్ణాజిల్లా రచయితల 5వ మహాసభల నిర్వహణ విషయమై 1983లో వారిని సంప్రదించినప్పుడు విడిగా సభలు జరపటం కాదు, సంఘటితంగా ఉండే స్థిరమైన ఒక రచయితల సంఘం మన జిల్లాకు ఉండాలని సూచించారు.

వారి సంకల్ప ఫలంగా మండలివారే గౌరవాధ్యక్షులుగా, శ్రీ ముక్కామల నాగభూషణం అధ్యక్షులుగా, శ్రీ గుత్తికొండ సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి, డా॥ తెన్నేటి హేమలత, డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావు ప్రభృతులు ఉపాధ్యక్షులుగా, శ్రీ మండలి బుద్ధప్రసాద్, డా॥ జి.వి. పూర్ణచందు కార్యదర్శులుగా, ఈ కృష్ణాజిల్లా రచయితల సంఘం ఒక ఆకృతి దాల్చింది. సినారే, దాశరధి, యం.ఆర్ అప్పారావు ప్రభృతులు గౌరవ సలహాదారులుగా ఉన్నారు.

ఆరు పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించి, భాషోద్యమదీప్తిని జ్వలింప చేసింది కృష్ణాజిల్లా రచయితల సంఘం.

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఇందుకు మాకు అండగా నిలిచారు!

పాతికకు పైగా బృహత్ పరిశోధన గ్రంథాలు ప్రచురించింది. "తెలుగే ప్రాచీనం", "సింధు–కృష్ణ లోయల నాగరికతలు" వంటి జాతీయ సదస్సులు తెలుగుభాష చరిత్ర మూలాలను అనేకం వెలికితీశాయి. ఈ కార్యాలన్నింటికీ కర్త, కర్మ, క్రియగా శ్రీ బుద్ధప్రసాద్ ఈ సంస్థను నడిపిస్తున్నారు.



2020 కరోనా పరిస్థితుల్లో కూడా విడవకుండా మండలి వారి జయంతి నిర్వహించి ప్రతిభా పురస్కారాలను డా॥ జి.వి. పూర్ణచందు, డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌లకు అందించారు.

మండలి వెంకట కృష్ణారావుగారిపట్ల అపారమైన గౌరవం, శ్రీ బుద్ధప్రసాద్ పట్ల అమితమైన వాత్సల్యం కృష్ణాజిల్లా రచయితల సంఘ కార్యనిర్వహణకు ముఖ్య కారకాలు. ఆ ఇద్దరూ కలిగించిన స్ఫూర్తి తెలుగు భాషోద్యమానికి మమ్మల్ని సంఘటితం చేసింది. వారిపట్ల గల గౌరవాభిమానాలతో మండలివారి శతజయంత్యుత్సవాల నిర్వహణకు అనేక కార్యక్రమాలు రూపకల్పన చేసి నడిపిస్తోంది.

2026 జూలై 11,12 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలు శతజయంతిని చిరస్మరణీయం చేయాలనే ఉద్దేశంతో సంకల్పించినవే!

మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు సంస్థ

తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయి తీసుకురావాలనే లక్ష్యంతో శ్రీ మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగుసంస్థ ఏర్పాటు ప్రతిపాదనను తెచ్చారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతులను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడమే ఈ సంస్థ ఉద్దేశం. ఇంగ్లీషు లాగా తెలుగు భాష కూడా అంతర్జాతీయంగా ఎదగాలనే ఆలోచన ఆయనకు బలంగా ఉండేది. ప్రవాసంగా నివసిస్తున్న తెలుగు ప్రజల్లో భాషా–సాంస్కృతిక అనుబంధాన్ని పరిరక్షించడం, బలోపేతం చేయడం ద్వారా తెలుగు విదేశీయులకు మరింత పరిచయం కల్పించవచ్చని ఆయన విశ్వసించేవారు.

ప్రపంచవ్యాప్తంగా తెలుగు సాహిత్య సదస్సులు, మహాసభలు, భాషాబోధన కార్యక్రమాలు, పాఠ్యసామగ్రి తయారీ, ప్రముఖ రచయితలు, కవులు, పరిశోధకులకు సత్కారాలు, పురస్కారాలు, తెలుగు భాష, సాహిత్యంపై పరిశోధనలు, గ్రంథాల ప్రచురణ, వివిధ దేశాలలోని ప్రవాస తెలుగు సంఘాలతో సమన్వయం...ఇవి ఆయన లక్ష్యాలలోని ముఖ్య అంశాలు.

తెలుగు భాషను కేవలం ప్రాంతీయ భాషగా కాక, ప్రపంచ భాషగా నిలబెట్టే ప్రయత్నంలో, ముఖ్యంగా ప్రవాస యువతలో తెలుగు చదవడం, రాయడంపై ఆసక్తి పెంచటం, తెలుగు సాహిత్య–సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, అమెరికా, యూరోప్, ఆస్ట్రేలియా, ఆసియా తదితర ప్రాంతాల్లోని తెలుగు సంఘాలతో సమన్వయం...ఇవి అంతర్జాతీయ తెలుగుసంస్థకు ఆదర్శాలుగా రూపుదిద్దారు.

తెలుగును "ప్రపంచ తెలుగు"గా తీర్చిదిద్దాలనే ఆలోచనకు అంతర్జాతీయ తెలుగుసంస్థ కీలకపాత్ర పోషించాలని ఆయన అభిలషించారు. ఈ సంస్థ ప్రపంచ తెలుగు హృదయాలను భాషాసంస్కృతులతో అనుసంధానించే అంతర్జాతీయ వేదికగా నిలవాలని ఆయన ఎన్నో కలలు కనుకున్నారు.

1975 సెప్టెంబర్ 8న అంతర్జాతీయ తెలుగుసంస్థను మొదటి ప్రపంచ తెలుగు మహాసభల్లో చేసిన తీర్మానం మేరకు ప్రారంభించారు. 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఒక విభాగంగా విలీనం అయి, "అంతర్జాతీయ తెలుగు కేంద్రం"గా పేరు మార్పు పొందింది. సంస్థలో సమాజం, సంస్కృతి, భాషలు, సాహిత్యం, అనువాదం, ప్రచురణ...మొత్తం మూడు విభాగాలు ఉన్నాయి. 2007లో శ్రీ మండలి వెంకట కృష్ణారావు ఈ కేంద్రాన్ని "అంతర్జాతీయ తెలుగు కేంద్రం"గా మార్చారు.

"శ్రీ మండలి వంటి మహానుభావులు ఒక జాతిలోనూ, ఒక దేశంలోనూ అరుదుగా జనిస్తారు. కొన్ని వందల సంవత్సరాలకీ అటువంటి త్యాగమూర్తులు మళ్లీ పుట్టరు. ఆయన పేరు తెలుగువారి హృదయాల్లోనే కాక, తెలుగు సంస్కృతిలోనూ శాశ్వతంగా నిలిచిపోతుంది. అటువంటి మహత్తర త్యాగమూర్తి మన మండలిగారు.

తెలుగు జాతి వేల సంవత్సరాల క్రితమే జన్మించింది. తెలుగు భాష, తెలుగు సంస్కృతీ కూడా అంతే ప్రాచీనమైనవి. ఈ పవిత్ర తెలుగు గడ్డపై ఎందరో మహానుభావులు పుట్టారు. కానీ తెలుగు ప్రపంచంలో ఎవరూ, ఎప్పుడూ చేయని ఒక మహాకార్యాన్ని చేసి, తన పేరును చరిత్రలో చిరస్థాయిగా నిలుపుకున్న మహావ్యక్తి మన మండలి. ఆ మహాకార్యం ఏమిటంటే...ప్రపంచ తెలుగు మహాసభలు." అంటారందుకే మలేసియా ఆంధ్ర సంఘానికి చెందిన శ్రీ మదిని సోమనాయుడు.

1977లో అంతర్జాతీయ తెలుగు సంస్థ ద్వితీయ వార్షికోత్సవ సభలో, రెండేళ్ల కాలంలో సంస్థ సాధించిన ముఖ్యమైన విజయాలను ప్రకటిస్తూ మండలివారు ప్రసంగించారు. ఆ సందర్భంలో, విదేశీ ఆంధ్ర విద్యార్థులకు, రాష్ట్రేతర ఆంధ్రులకు మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుకునేందుకు మూడేసి సీట్లు సాధించగలిగామని తెలిపారు. ఈ సీట్ల సంఖ్యను రెట్టింపు చేయవలసిందిగా ప్రభుత్వానికి, సంస్థ అధ్యక్షులుగా ఆయన వినతిపత్రం సమర్పించినట్టు పేర్కొన్నారు.

అలాగే, విదేశాల్లో తెలుగు బోధిస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్టు వివరించారు.

రాష్ట్రేతర ఆంధ్రులకు మరింతగా తెలుగు చదువుకునే అవకాశాలు కల్పించడం, ప్రముఖుల స్మారకోపన్యాసాల నిర్వహణ, ప్రముఖులు-పెద్దలతో ఇంటర్వ్యూలు నిర్వహించి వారి కంఠస్వరాన్ని భద్రపరచడం వంటి అనేక సాంస్కృతిక-విద్యా కార్యక్రమాలను సంస్థ చేపట్టినట్టు ఆయన ప్రస్తావించారు.

శ్రీ మండలి వెంకట కృష్ణరావు ఫిషరీస్ పాలిటెక్నిక్

భావదేవరపల్లిలో 2007 సెప్టెంబర్‌లో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫిషరీస్ పాలిటెక్నిక్ సంస్థను భావదేవరపల్లిలో ప్రారంభించి దాన్ని మండలి వెంకటకృష్ణారావుగారి పేరున వ్యవహరించారు. ఈ కళాశాల ప్రధాన లక్ష్యం ఆక్వాకల్చర్ పరిశ్రమకు అవసరమైన సాంకేతిక నిపుణులను తయారు చేయడం, చిన్న మరియు అంచు రైతులకు సుస్థిర ఆక్వాకల్చర్ కోసం సాంకేతిక సహాయం అందించడం. దివిసీమ మౌలికంగా మత్స్యకారులకు ఆధారభూతమైన ప్రాంతం కావటంతో ఇక్కడ ఈ మత్స్యకళాశాలను ఏర్పాటుచేయటం, దాన్ని మండలి పేరున వ్యవహరించటం చాలా సముచిత నిర్ణయాలు.

మండలి వెంకట కృష్ణారావు సాంస్కృతిక పురస్కారాలు

తెలుగు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ తెలుగుసంస్థ పక్షాన 2007 నుండీ మండలి వెంకట కృష్ణరావు సాంస్కృతిక పురస్కారం ప్రారంభించబడింది. మొదటిసారి ఈ పురస్కారం మలేషియా తెలుగు సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మదిని సోమనాయుడు గారికి అందజేయబడింది. అప్పటి నుండీ ప్రతి ఏడాదీ రాష్ట్రేతర లేదా విదేశీ తెలుగు ప్రముఖునికి ఈ పురస్కారాన్ని ఇచ్చి గౌరవిస్తున్నారు.

గాంధీక్షేత్రం అవనిగడ్డలో మండలి ఫౌండేషన్ పేరుతో శ్రీ బుద్ధప్రసాద్ మరియు మండలివారి కుటుంబీకులంతా కలిసి ప్రతి ఏడాదీ ఒక తెలుగు ప్రముఖునికి లక్షరూపాయల నగదు పురస్కారం అందిస్తున్నారు. డా॥ నోరి దత్తాత్రేయుడు, శ్రీమతి పి.సుశీల, డా॥ జి.సతీష్‌రెడ్డి, జస్టిస్ యన్.వి. రమణ ప్రభృతులకు ఈ పురస్కారాలందించారు.

కృష్ణాజిల్లా రచయితల సంఘం 2008 నుండీ మండలి వెంకట కృష్ణారావు భాషా పురస్కారాన్ని 10వేల రూపాయల నగదుతో ప్రతిఏటా ఒక భాషావేత్త లేదా భాషకోసం శ్రమించే వ్యక్తికి అందచేస్తూ వస్తున్నారు.

మండలి వెంకటకృష్ణారావు ఆం.ప్ర. అధికారభాషాసంఘం

ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘ వ్యవస్థాపకుడైన మండలి వెంకట కృష్ణారావుగారి పేరుని ఆయన శతజయంతి ఉత్సవాల ఆరంభ సభలో మాన్య ముఖ్యమంత్రివర్యులు స్వయంగా ఆ మహాసంస్థకు పెడ్తున్నట్లు ప్రకటించారు.

వెనువెంటనే “మండలి వెంకట కృష్ణారావు ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం”గా దానిపేరుని మారుస్తున్నట్టుగా జీవో కూడా విడుదల చేశారు.

చిరస్మరణీయమైన సేవలందించినవారి పేర్లు జనం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయనటానికి మండలివారే తార్కాణం!

గాంధీ నిర్మాణ కార్యక్రమాల కార్యకర్తగా శ్రీ మండలి వెంకట కృష్ణారావు

దక్షిణ భారత నిర్మాణ కార్యకర్తల మహాసభలు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల సేవకుల మహాసభలను నిర్వహించి, నిర్మాణ కార్యకర్తలలో నూతన ఉత్సాహాన్ని రగిలించడానికి నిరంతరం కృషి చేశారు. ఈ సేవలకు గుర్తింపుగా 1977-78 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల సమాజసేవకుల సంఘం ఆయనకు ప్రతిష్ఠాత్మక "ప్రభాకర్ జీ అవార్డు"ని ప్రదానం చేసింది.

1982 నవంబరులో శ్రీ విజయభాస్కర రెడ్డి మంత్రివర్గంలో సహకార శాఖ మంత్రిగా నియమితులై, సహకారోద్యమాన్ని ప్రజల ఉద్యమంగా మలిచేందుకు కృషి చేశారు. గాంధీజీ తరువాత, భారతదేశం అత్యంత గౌరవంతో స్మరించిన వినోబాజీ భావే పరమపదించిన సందర్భంలో, ఆయన అంత్యక్రియల్లో పాల్గొని, భూదానోద్యమానికి జన్మస్థలమైన పోచంపల్లిలో 1982 నవంబర్ 22న జరిగిన వినోబాజీ శ్రద్ధాంజలి సభలో చారిత్రాత్మక ప్రకటన చేశారు... తన ఆదాయంలో ప్రతి ఏడాది ఆరవ వంతు దీనజనోద్ధరణకు ఖర్చు చేస్తానని. ఈ విధంగా వినోబాజీ ప్రతిపాదించిన సంపత్తిదాన సిద్ధాంతాన్ని ఆయన ఆచరణలోకి తీసుకున్నారు.

1988 జనవరిలో సాధారణ ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికై, ప్రజాసేవకు పునరంకితమయ్యారు. 1985లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా నియమితులై, రాష్ట్రంలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి కృషి చేశారు..

మారిషస్‌లో విశ్వహిందీ మహాసభలకు ప్రతినిధిగా

1978లో రెండవ విశ్వ హిందీ మహాసభకు భారత ప్రతినిధివర్గ సభ్యుడిగా మారిషస్ వెళ్లిన మండలివారు, అక్కడి తెలుగువారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు. మారిషస్ ప్రధాని సర్ శివసాగర్ రామగులామ్‌ను కలుసుకుని, తెలుగువారితో ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలపరిచారు. ఈ ప్రతినిధి బృందాన్ని స్వయంగా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఎంపిక చేయగా, అందుకు మండలివారు ఆమెకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నాలుగు రోజుల పాటు తెలుగువారు నివసిస్తున్న 30 కేంద్రాలను నిర్విరామంగా సందర్శించారు. మారిషస్‌లోని అనేక పాఠశాలలను చూసి, అక్కడ తెలుగు పిల్లలు చదువుకుంటున్న విధానాన్ని, ఉపాధ్యాయులు తెలుగును బోధిస్తున్న తీరును పరిశీలించారు. అనేక సభలలో అక్కడి వారికి సులభంగా అర్థమయ్యేలా సరళమైన శైలిలో మాట్లాడారు. తెలుగు ప్రజలు ఆబాలగోపాలం...86 ఏళ్ల ముదుసలుల నుంచి చిన్న పిల్లల వరకు... సమావేశాలకు హాజరై, అపూర్వమైన గౌరవం, ఆప్యాయత ప్రదర్శించారు.

"మా తాతముత్తాతల దేశం నుంచి నాయనా వచ్చావు... నిండు సంతోషం. మా ఇంటికి రావాలి" అంటూ పండు ముత్తయిదువలు ఆయనను తమ ఇళ్లకు తీసుకువెళ్లి చూపించారు.

తెలుగు ప్రజలలో వెల్లివిరిసిన ఉత్సాహం వర్ణింపనలవికాని దృశ్యం.

వారు పలికిన మాటలు, పాడిన పాటలు, చేసిన భజనలు వీనులవిందు చేశాయి. తెలుగు వారు ఆ దీవికి వెళ్లి 140 సంవత్సరాలు అయినా, ఈ నాటికీ తమ తెలుగుదనాన్ని కాపాడుకుంటూ, భాషా-సంస్కృతులను పోషించుకుంటున్నారు.

మారిషస్ నుంచి తిరిగివచ్చిన వెంటనే హైదరాబాద్ హోటల్ ద్వారకలో మండలివారికి అభినందన సభ జరిగింది. ఆ సభలో మాట్లాడుతూ, మారిషస్ తెలుగు పిల్లల చదువుకు తెలుగు పాఠ్యగ్రంథాలు అవసరం అని ఆయన సూచించారు. వెంటనే సభాసదులు స్పందించి, అక్కడికక్కడే తమ శక్తికొలది విరాళాలు ప్రకటించారు. ఆ విధంగా వచ్చిన రూ. 20,000తో ఒక ప్రింటింగ్ ప్రెస్‌ను బహూకరించడానికి నిర్ణయించారు.

దక్షిణ భారత హిందీ ప్రచార సభ రూ. 3,000 విలువైన పుస్తకాలను అందించగా, ఆంధ్ర సారస్వత పరిషత్ పక్షాన మారిషస్‌లో ఉన్న 60 ఆంధ్ర శాఖలకు ఒక్కొక్కటికి 100 చొప్పున మొత్తం 6,000 పుస్తకాలను పంపేందుకు సిద్ధమయ్యారు.

హైదరాబాద్‌లోని కళాసాహితి సంస్థ ఆధునికాంధ్ర సాహిత్య నిర్మాతలు గ్రంథం 60 ప్రతులను అందించింది.

ఇలా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరి మేలు కోసం అంకితభావంతో పాటుపడిన మహానుభావుడు మండలివారే.

తానా సభల గురించి మండలివారి ప్రశంస

1975లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కాగానే, తొలుత స్పందించింది ఉత్తర అమెరికాలోని తెలుగువారే.

1976 ఆగస్టు 26న, న్యూయార్క్‌లో వినాయక చవితి సందర్భంగా సమావేశమైన వారు, ఉత్తర అమెరికా తెలుగు మహాసభలను నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా డా. గుత్తికొండ రవీంద్రనాథ్, డా. కాకరాల సుబ్బారావుగార్ల సహకారంతో 1977 మే 28, 29 తేదీలలో న్యూయార్క్ పట్టణంలోఉత్తర అమెరికా తెలుగు మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు 900 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

అదే సందర్భంలో తానా (Telugu Association of North America - TANA) సంస్థ ఏర్పడి, మేరీలాండ్‌లో నమోదు చేయబడింది.

తదుపరి తానా మహాసభల్ని 1979లో డిట్రాయిట్,1981లో చికాగో, 1983లో వాషింగ్టన్, 1985లో లాస్ ఏంజల్స్‌లో, సెయింట్ లూయిస్‌లో నిర్వహించారు.

ఇలా తానా సభల ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ, ఉత్తర అమెరికాలోని తెలుగువారి సంఘటిత శక్తి, వారితెలుగుదనం, భాషా-సాంస్కృతిక చైతన్యం గురించి మండలివారు ఒక సుసంపన్నమైన వ్యాసంలో విపులంగా వివరించారు.

మలేషియాలో తెలుగు వారి గురించి

1979లో మండలివారు మలేషియాకు వెళ్లి, ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభల ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించారు. దక్షిణాసియాలోని అనేక తెలుగు గ్రామాలను సందర్శించి, అక్కడి తెలుగు సమాజానికి నూతన ఉత్సాహాన్ని నింపారు. మలేషియాలోని తెలుగువారి పరిస్థితిపై ఒక వ్యాసంలో ఆయన ఇలా పేర్కొన్నారు:

"మలేషియాలో ఇండియన్ కాంగ్రెస్ పేరుతో తమిళులు రాజకీయ ప్రాబల్యం సంపాదించారు. ఆ సంస్థలు తెలుగువారిని ప్రోత్సహించడం లేదు. అందువల్ల 1955లో ప్రత్యేకంగా ఆంధ్ర సంఘం ఏర్పాటు అయింది. ఇక్కడ ఉన్న తెలుగువారంతా తెలుగు సాహిత్య – సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి, తెలుగు విద్యాభివృద్ధికి, తెలుగు భాషాభివృద్ధికి, తెలుగుదనాన్ని చైతన్యవంతం చేయడానికి ఈ సంఘాన్ని స్థాపించుకున్నారు.

అప్పటినుంచి స్థానికంగా తెలుగువారు ఎదుర్కొనే సమస్యలను పరిశీలించడం, వారి సాధకబాధకాలను గమనించడం ఈ సంఘం తన ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఈ సంఘానికి 15 శాఖలు ఉన్నాయి. నిబద్ధతగల మంచి కార్యకర్తలు పని చేస్తున్నారు."

1984 ఏప్రిల్‌లో, మలేషియా తెలుగు సంఘం ఆహ్వానంతో అక్కడి ఉగాది ఉత్సవాల్లో పాల్గొని, వివిధ ప్రాంతాల్లో జరిగిన సభలలో ప్రసంగిస్తూ తెలుగువారిని ఐక్యపరిచారు.

ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభలు మలేషియాలో జరగడానికి కారణభూతులైనందుకు, అలాగే విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే వేదికపై సమీకరించినందుకు, మలేషియా ఆంధ్రులు శ్రీ మండలివారిని ఘనంగా సత్కరించారు...

యూరప్ పర్యటన

1988 నవంబరులో, బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ ఆహ్వానంపై మండలివారు యునైటెడ్ కింగ్డమ్, యునెస్కో (పారిస్), కెనడా దేశాలను పర్యటించారు. 1977లో దివిసీమను కుదిపిన ఉప్పెన–తుఫాను విపత్తులో బాధితులకు సహాయం చేసిన అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఆయన వ్యక్తిగతంగా కలుసుకుని, కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయా దేశాల్లోని తెలుగు హృదయాలతో మమేకమై, వారి సమస్యలను సన్నిహితంగా విని, తెలుగు భాషా–సంస్కృతుల పట్ల గర్వాన్ని మరింత ప్రగాఢం చేశారు.

ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సంక్షోభాలకు మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతమే శాశ్వత పరిష్కారం అని పాశ్చాత్య దేశాలకు స్పష్టంగా చాటి చెప్పారు.

రాష్ట్రేతరాంధ్రులకు మండలివారి చేయూత

మండలివారు విద్యాశాఖామాత్యులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత, దేశంలోనూ విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి మంచీ–చెడుల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అనే విషయాన్ని గట్టిగా ప్రతిపాదించారు. మనది భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రం కావడం ఇందుకు ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. ఈ బాధ్యతా భావంతోనే అంతర్జాతీయ తెలుగు సంస్థ స్థాపనను ఆయన ప్రతిపాదించారు.

అంతర్జాతీయ తెలుగు సంస్థ ఏర్పడిన అనంతరం, వివిధ రాష్ట్రాలలో పనిచేస్తున్న తెలుగు సాంస్కృతిక సంస్థలకు, తెలుగు విద్యాసంస్థలకు 1976–77 సంవత్సరానికి గాను ఆమోదించిన నిధుల వివరాలను 'ఆనందవాణి' పత్రికలో ప్రచురించారు.

దాదాపు 30 సంస్థలకు రూ. 1,000 నుంచి రూ. 50,000 వరకు మొత్తం రూ. 10.45 లక్షల మేర గ్రాంట్లు మంజూరయ్యాయి. వీటిలో ముఖ్యమైనవి...

ఒరిస్సాలోని సరందా గ్రామం తెలుగు–ఒరియా ప్రాథమిక పాఠశాల, అస్సాంలోని జోర్హాత్ గ్రామం తెలుగు సంస్థ, బరంపురం ఆంధ్రభాషాభివృద్ధి సమాజం, కొచ్చిన్ ఆంధ్ర అసోసియేషన్, అలహాబాద్ ఆంధ్ర అసోసియేషన్, గౌహతిలోని సరస్వతీ విద్యాలయం, జైపూర్ ఆంధ్ర అసోసియేషన్, హోసూరు ఆంధ్ర సాంస్కృతిక సమితి, హుగ్లీ పొట్టిశ్రీరాములు ఆంధ్ర జూనియర్ హై స్కూల్, భిలాయ్ ఆంధ్ర సాహిత్య సమితి, సూరత్ తెలుగు యూత్ సేవా కమిటీ, బరోడా ఆంధ్ర సంస్థ మొదలైనవి.

సంస్థలను స్థాపించడం మాత్రమే సరిపోదు; వాటి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా విధులను నిర్ణయించి, అవసరమైన నిధులను కేటాయించినప్పుడే ఆ కార్యక్రమాలు జయప్రదం అవుతాయి. ఇందుకు ప్రభుత్వాల నుంచి నిబద్ధత అవసరం. ఆ లోపం తలెత్తకుండా చూడగలిగింది మండలివారి నిరంతర నాయకత్వశక్తి.!

1976 రాష్ట్రేతరాంధ్రుల సదస్సు నిర్వహణ

1976 ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో, ఇతర రాష్ట్రాలలో నివసిస్తున్న తెలుగువారి విద్యా–సాంస్కృతిక సమస్యలను తెలుసుకోవడం, వాటికి పరిష్కారాలను చర్చించటం లక్ష్యంగా మండలివారి ఆధ్వర్యంలో ఒక విశేష సదస్సు నిర్వహించబడింది. అప్పట్లో ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న మర్రి చెన్నారెడ్డిగారిని ఆహ్వానించి, ఆయన చేతుల మీదుగా సదస్సును ప్రారంభించారు.

ఈ సదస్సులో న్యూఢిల్లీ నుండి శ్రీ బుర్రా వెంకటప్పయ్య, మద్రాస్ నుండి జి. ఆర్. రావు, ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ, కలకత్తా నుండి జి. వి. ఆర్. మూర్తి, బొంబాయి నుండి

సోమంచి యజ్ఞన్నశాస్త్రి, హోసూరు నుండి కె.ఎస్. కోదండరామయ్య తదితర ప్రసిద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సదస్సు అంతా ఉత్సాహభరితంగా సాగింది. మండలివారు ప్రతినిధులతో కలిసి సుదీర్ఘంగా చర్చల్లో పాల్గొని, వారి అభిప్రాయాలను సమగ్రంగా వినిపించారు.

విద్యాశాఖ ఉన్నతాధికారులు...సంయుక్త కార్యదర్శి ఆర్.వి. కృష్ణన్, పాఠశాల విద్యా డైరెక్టర్ పి.ఆదినారాయణ... ప్రతినిధుల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు.

రాష్ట్రం వెలుపల ఉన్న తెలుగువారి పిల్లల కోసం, రాష్ట్రంలోని వృత్తి విద్యా కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలలో తగిన విధంగా ప్రత్యేక కేటాయింపులు చేయగలమని ముఖ్యమంత్రి తన సమాపన ఉపన్యాసంలో ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ప్రవాసాంధ్రుల కోసం ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయనున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు ప్రకటించారు.

అదే విధంగా, ప్రవాసాంధ్రుల విద్యా-సాంస్కృతిక సౌకర్యాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం కూడా ఉదారంగా ఆర్థిక సహాయం అందించేందుకు అంగీకరించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు..

హుగ్లీలో వెంకటకృష్ణాంధ్ర గ్రంథాలయం

పశ్చిమబెంగాల్ హుగ్లీలోని మహేష్‌లో పాఠ్యగ్రంథాలతో కూడిన గ్రంథాలయం కోసం ఒక గదిని నిర్మించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పాఠ్య గ్రంథాలయానికి "వెంకట కృష్ణాంధ్ర పాఠ్యగ్రంథాలయం" అని పేరు పెట్టారు. ఈ గ్రంథాలయానికి అధ్యక్షులుగా శ్రీ ఇ. వీర్రాజుగారున్నారు అనాడు.

నాగపూర్ ఆంధ్రసంఘం వజ్రోత్సవాలలో మండలివారు

1911లో స్థాపించబడిన నాగపూర్ ఆంధ్ర సంఘానికి అక్కడ ఒక స్వంత స్థలమూ, భవనమూ ఉన్నాయి. అపురూప గ్రంథాలతో ఒక గ్రంథాలయం కూడా ఉంది. తెలుగు తరగతులు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. పై అంతస్థులో సభామందిరం ఉంది. అంతర్జాతీయ తెలుగు సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానం కలిసి లక్షరూపాయల విరాళం ఇవ్వగా ఈ సభామందిర నిర్మాణం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ చెన్నారెడ్డి ఈ సభా భవనాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ తెలుగు సంస్థ అధ్యక్షులుగ మండలివారు ఈ సభకు అధ్యక్షత వహించారు.



19-11-1977.

ఏడూ... ఏడూ... అంటూ రెండు ఏడులు కలసి ఏరంత ఏడుపు సృష్టించిన ఒక అమావాస్య నిశి.

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ పీడగాలి ఊళ్ల ముఖచిత్రాలను చెరిపేసింది. రాకాసి అలలు చెలియలికట్టలు దాటి ఆకాశాన్నే కూల్చినట్టయ్యాయి. పదిహేనువేల ప్రాణాలు ఒక్క క్షణంలో అలల మీద వడ్లగింజల్లా తేలిపోయాయి. ఉప్పెన తాకిడికి వీధులు ఉప్పుతో బిగుసుకున్నాయి. మట్టి దుఃఖంలో కూరుకుపోయింది. గుళ్ళూ గోపురాలూ నిలిచినా దేవుళ్లు కొట్టుకుపోయారు. జ్ఞాపకాలే తప్ప, ప్రాణాలు మిగలని నేలగా దివిసీమ మారిపోయింది.

అది నలభై ఎనిమిదేళ్లనాటి పీడకల.

ఓడిన మానవ అహంకారంపై సముద్రుడి దాష్టీకం. పలుగులు తెచ్చి తవ్వి కూల్చినట్టుగా మహావృక్షాలు నేలమట్టమయ్యాయి; ఊళ్లకు ఊళ్లు సముద్రం అడుగునే అణిగిపోయాయి. నాలి, సొర్లగొంది, హంసలదీవి, సంగమేశ్వరం, గుల్లలమోద, పాలకాయతిప్ప...ఈ పేర్లన్నీ ఇక పటాలపై మాత్రమే మిగిలిన గ్రామాలు. ఒక ఊరు, ఒక జ్ఞాపకం, ఒక సంస్కృతి...ఒక్కసారిగా సముద్రంలో కలిసిపోయింది.

జీవితాలు జ్ఞాపకాలయ్యాయి.

శబ్దాలు నిశ్శబ్దాలయ్యాయి.

హీరోషిమా-నాగసాకీల విధ్వంసానికి అనేక రెట్లు మించిన విధ్వంసాన్ని కొన్ని క్షణాలపాటు సముద్రమే సృష్టించింది.

"విజయవాడ నుంచి తొంభై కిలోమీటర్ల దూరం ప్రయాణించినంత వరకూ ప్రాణం లేని ప్రపంచమే కనిపించింది. ముందుకు వెళ్లాక దివిసీమలో సజీవుడైన మనిషి ఎవరైనా

మిగిలి ఉంటాడా అన్న సందేహమే కలిగింది” అని టైమ్స్ ఆఫ్ ఇండియా విలేకరి వ్రాశాడు. ఇది డిసెంబరు 31న...ఉప్పెన వచ్చి నలభై ఐదు రోజుల తర్వాత వ్రాసిన మాట. ఉప్పెన వచ్చిన ఆ రాత్రి దృశ్యం ఇంకెంత భయానకంగా ఉండి ఉంటుందో ఊహకందని విషయం.

ఉప్పెన అంటే సముద్రం పోటుపెట్టిన వేళ, తుపాను గర్జనతో కలసి వచ్చిన ముంపు. సముద్రం ఎగిరి దూకినట్టు మీదపడి, అందినది అందినట్టే లోపలికి లాక్కుపోయింది. సమాచార సాంకేతిక సాధనాలు లేని కాలం అది. రేడియోలో కోస్తాతీరాన్ని ఉప్పెన ముంచెత్తబోతోందన్న హెచ్చరికలు పదేపదే వినిపించినా, ప్రభుత్వ యంత్రాంగమూ, ప్రజలూ చెవిన పెట్టలేదు. “ఇది మామూలు గాలివాన మాత్రమే” అన్న ధీమానే కొంపల్ని సముద్రంలో ముంచింది.

ఎవరో చెట్ల కొమ్మలను ఆశ్రయించారు.

ఇంకెవరో చేతికొచ్చినదేదైనా ఇదే జీవితమన్నట్టు పట్టుకున్నారు.

ప్రాణాలతో బయటపడ్డవారు ఎలా బయటపడ్డారో వారికే తెలియని అస్పష్టత అంతటా కమ్ముకుంది.

అయినా, ఆ విపత్కర క్షణంలో ధైర్యం వదలని కొందరు ఉన్నారు. తమ ప్రాణాల్ని మాత్రమే కాదు, పక్కవారి శ్వాసలనూ తమ చేతుల్లో పెట్టుకుని, వీరోచితంగా సముద్రాన్ని ఎదుర్కొన్నారు.

మూడు లక్షల ఇళ్లు ధ్వంసమయ్యాయి.



ఉప్పెన భయానక దృశ్యాలకు తల్లడిల్లిపోతున్న ఇద్దరు మహా నాయకులు, మండలివారూ, ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారు

తుఫాను అల్పతరంగం మరింత భయంకరంగా విరుచుకుపడింది. దివిసీమ ప్రాంతంలో ఐదు నుంచి ఏడు మీటర్ల ఎత్తు అలలు తీరాన్ని ముంచెత్తాయి. ఎనిమిది కిలోమీటర్ల లోపలికి సముద్రపు నీరు చొచ్చుకువచ్చి తీరగ్రామాలన్నీ నీటమునిగాయి. నిద్రలో ఉన్నవారు నిద్రలోనే జలసమాధి అయ్యారు. కొందరే దేవాలయాలు, పాఠశాలలు, పక్కా భవనాల్లో ఆశ్రయం పొందగలిగారు. సముద్రం లోనికి దూసుకొచ్చిన క్షణంలో, ఊరంతా సముద్రంలో కలిసిపోయింది.

కేవలం ఒక గంటకుగానే సముద్రం పొడవునా 80 కిలోమీటర్ల మేర, 16 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉప్పెన కేంద్రీకృతమైంది. ఆ 6 మీటర్ల ఎత్తు అలలు కొద్దిపాటి అడుగులు ఎగిసిపడ్డాయి. ఉదయం 8:30 నుండి ప్రారంభమై, మరుసటి ఉదయం వరకు 1,337.2 మి.మీ వర్షపాతం నమోదైంది. తల్లులు సముద్ర రౌద్రాన్ని చూసి భయంతో తల్లడిల్లారు; పిల్లలు కెరటాల ముసురులో నామరూపం తెలియక మాయమయ్యారు.

ఒక కృష్ణాజిల్లా దివిసీమలోనే 8,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 2,765 పశువులు మరణించాయి. మొత్తం 91 గ్రామాలు నీటమునిగిపోయాయి. 91,785 మంది తుపాను బాధితులు ప్రాణాలతో బయటపడ్డారు. 3,18,570 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 2,765,000 కోట్లు రూపాయల ఆర్థిక నష్టం వచ్చింది. 4,836 ప్రభుత్వ భవనాలు ధ్వంసమయ్యాయి. 2,408 కిమీ రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి.

8,547 లక్షల ఎకరాల్లో 14,703,95 రూపాయల పంటలు సముద్రం చేత నాశనం అయ్యాయి. 11 లక్షల ఎకరాల్లో పత్తి, చెరకు, అరటి, పొగాకు, కొబ్బరి పంటలు క్షీణించాయి. లక్షల్లో పశువులు, పక్షులు, జంతువులు మరణించాయి. మత్స్యకార గ్రామాల్లో పడవలు, వలలు, పరికరాలు సముద్రం మింగేసింది. రహదారులు, రైల్వేలు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. జీవనాధారం ఒక్కసారిగా శూన్యమైంది.


ముంచిన కడలి వెనక్కి కదలకపోవటాన, పల్లపు ప్రాంతాలు 10-15 అడుగుల లోతు నీటిలో 10 గంటల సేపు మునిగి ఉన్నాయి. అలాంటి పరిస్థితిలో బ్రతికే వారి సంఖ్య అరుదే. తుపాను తర్వాత వేలాది శవాలు నీటిలో తేలుతూ



చెప్పుల్లేకుండా బురదలో ముళ్ల దారుల్లో కాళ్లకు గాయాలైనా కట్లు కట్టుకుని తిరుగుతున్న శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు.

కనిపించాయి. ఇంకో 10% మంది ప్రజలు జలసమాధి అయి ఉంటారని అంచనా. వారిలో ఎక్కువ మంది మత్స్యకారులు.

"పెనుతుఫాను బీభత్సంలో, పీనుగుల నడుమ మెలగినవాడు
అనాధ బాలలను భుజాలపై మోసిన వాడు.
అనాధ ప్రేత సంస్కారం చేసినవాడు
కన్నీటి కడలిలో ఈదుకొంటూ
కన్నీటి బ్రతుకులను కాపాడినాడు.
మహాత్ముడు చెప్పాడు, మండలి చేసి చూపాడు... **దాశరధి.**



ఉప్పెన రోజున మృత్యుదేవత తాండవించినా, మరుసటి రోజు నుంచే కరుణరసం ప్రవహించి పోయింది. పెను ఉప్పెన వచ్చినా దివిసీమ గుండె ధైర్యం చెదరలేదు. ప్రాణాలతో బయటపడిన వారి మనో నిబ్బరం అందరినీ ఆశ్చర్యపరిచింది. సహాయచర్యల కోసం దాతలు, కరుణామూర్తులు వెల్లువలా వచ్చినప్పటికీ, బాధితులు తమ దుఃఖాన్ని మరచి ఆపద్బాంధవుల్లో భాగస్వాములయ్యారు.


శవాలు కుళ్లిపోతున్న కారణంగా వాయువు వ్యాధిగా మారే పరిస్థితి ఏర్పడింది. గుర్తుపట్టలేనంతగా దెబ్బతిన్న శవాలను సామూహికంగా దహనం చేయాల్సి వచ్చింది. వారం రోజులూ, పదిరోజులూ, పదిహేనురోజులూ...మృతదేహాలను తొలగించి ఖననం, దహనం చేసేటప్పటికీ కొత్త శవాలు దొరకడం కొనసాగింది.

గుట్టలుగా పడిపోయిన శవాలను తొలగించేందుకు ప్రజల్లో భయమే ప్రతిబంధక మయ్యింది. మరణాన్ని ఎదుర్కోవడానికి అందరికి ధైర్యం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి మండలివారు ప్రయత్నించగా, ఉక్కుమనిషి మహనీయుడు ప్రభాకర్‌జీ తోడుగా నిలిచారు. ఆయన ఆధ్వర్యంలో "శవసేవ" అనే అసాధారణ కార్యక్రమం మొదలయ్యింది.

కృష్ణారావుగారు శవసేన ఏర్పాటు సూచనను ప్రభుత్వానికి తెలియజెప్పి, అనుమతి పొందారు. ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపింది. సహాయక బృందాలను తరలించే కార్యక్రమాలు యుద్ధప్రాతిపకంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, యువకులు, సర్వోదయ కార్యకర్తలు, ఆర్‌ఎస్‌ఎస్, కాంగ్రెస్ వాలంటీర్లు, పోలీసులు, సింగరేణి కార్మికులు, ఖైదీలు...ప్రాణాన్ని ఎదుర్కొనే ధైర్యంతో స్వచ్ఛందంగా శవసేనలో చేరి సేవ చేయడంలో నిబద్ధత చూపారు.

శవాలను సామూహిక దహనానికి వేగంగా సిద్ధం చేశారు. కాలేజీ, విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఖైదీలు...అందరూ స్వచ్ఛందంగా శవసేవలో పాల్గొన్నారు. ఇది పని మాత్రమే కాదు...మానవత్వానికి ఇచ్చిన ఒక నిశ్శబ్ద ప్రార్థన.

అన్నదాన శిబిరాలకు కట్టుబట్టలు, దుప్పట్లు, వంటసామాన్లు, నిత్యావసర వస్తువులు అనూహ్యంగా సులభంగా లభించాయి. ఏ ఒక్కరూ ఆకలికి మాడకుండా చూసుకున్నారు.



ప్రాణాలు కొంత కుదుట పడ్డాక, దివిసీమను పూర్వం కన్నా మెరుగైన స్థితికి తిరిగి నిర్మించాలన్న సంకల్పం గొప్పది. ఈ సంకల్పం శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి ప్రేరణతో ఏర్పడింది, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి తోడ్పడినవి.

ఆయన పిలుపు మేరకు దేశం నలుమూలల నుంచి మెడికల్ విద్యార్థులు, వైద్యులు, ఆరోగ్యశాఖ అధికారులు, సహాయక వలంటీర్లు దివిసీమకు పరుగెత్తి వచ్చారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా తక్షణ చర్యలు చేపట్టారు. సేవాతత్పరుల సేవలను సమన్వయం చేయటం పెద్ద సమస్యగా ఉండగా, దివిసీమ గురించిన పూర్తి అవగాహన కలిగిన మండలి వెంకట కృష్ణారావు మారుమూల ప్రాంతాల పరిస్థితులను కూడా తెలుసుకుని, అందరికీ సరియైన సహాయం అందించగా, ఏ ఒక్కరికి అధికంగా లేదా అసలు అందకపోవటం వంటి సమస్యలు ఎదుర్కోలేదు.

ప్రత్యేకంగా ఆర్ఎస్సెస్, సత్యసాయి, రామకృష్ణ మిషన్ లాంటి సంస్థలు ఆయనకు అండగా నిలిచాయి. కృష్ణా డెల్టా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు, మచిలీపట్నం, విజయవాడ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దివిసీమలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, చీరాల, ఒంగోలు వంటి ప్రాంతాల్లో అనేక గ్రామాలు పూర్తిగా మాయం అయ్యాయి. కొన్ని గ్రామాల్లో 80% పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి.

తుఫాను అనంతరం ప్రభుత్వం 1,300 పైగా షెల్టర్లు నిర్మించింది. మదర్ థెరిసా, బిల్లీ గ్రహామ్ వంటి ప్రముఖులు బాధితులను పరామర్శించారు. భారత వాయుసేన, ఆర్మీ హెలికాప్టర్లు ఆహారం, మందులు ఎయిర్ డ్రాప్ ద్వారా పంపిణీ చేశాయి. 'శవసేన' ఏర్పాటు చేసి సామూహిక దహనాలు నిర్వహించబడ్డాయి. పునరావాస గ్రామాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, విద్యుత్, నీటి సరఫరా తిరిగి నిర్మించబడ్డాయి.



ఈ విపత్తు అనంతరం స్మారకార్థక చర్యలు చేపట్టబడ్డాయి. దివిసీమ, అవనిగడ్డ, పులిగడ్డ ప్రాంతాల్లో స్మారక స్థూపాలు నిర్మించబడ్డాయి. ప్రతి సంవత్సరం నవంబర్ 19న బాధితులను స్మరించుకుంటూ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. విపత్తు తర్వాత హెచ్చరిక వ్యవస్థలు, షెల్టర్లు, కరకట్టలు మరింత బలోపేతం చేయబడ్డాయి.

1977 తుఫాను మనకు ఒక కఠిన పాఠం నేర్పింది. ప్రకృతి శక్తిని నివారించడం మన చేతిలో లేదు, కానీ దాని ప్రభావాన్ని తగ్గించడం మన బాధ్యత. ఈ విపత్తు జ్ఞాపకం కేవలం విషాదకర చరిత్రగా కాకుండా, భవిష్యత్తు తరాలకు హెచ్చరికగా నిలవాలి. ప్రతి సంవత్సరం నవంబర్ 19న బాధితులను స్మరించడం ద్వారా భవిష్యత్తులో ఇటువంటి విపత్తులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలనే ప్రతిజ్ఞ మనం చేద్దాం.

ఇది ఒక ఆర్ద్రతతో కూడిన జ్ఞాపకం. ఒక ఊరు, ఒక సంస్కృతి, ఒక సమాజం సముద్రపు అలలతో కలిసిపోయినా, మన జ్ఞాపకాలలో, మన స్మారకాల్లో, మన ప్రతిజ్ఞల్లో అది ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

ఉప్పెన బాధితులకు సినీ కళాకారుల పక్షాన ఇతోధికంగా సహాయం అందించిన శ్రీ యన్ టి రామారావు, ప్రధాని మోరార్జీ, ముఖ్యమంత్రి వెంగళరావు, రాష్ట్రపతి సంజీవరెడ్డి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్వయంగా దివిసీమ పరిస్థితిని పరిశీలించి పరిస్థితిని అంచనా వేసారు. సర్వోదయ నాయకులు వినోబాభావే, ప్రభాకర్ జీ వంటి జాతీయ నాయకులు, బాలాసాహెబ్ దేవరస్, పెజావర్ స్వామి వంటి హిందూ ధార్మిక సంస్థల నేతలు, సత్యసాయిబాబా, జిల్లెళ్లమూడి అమ్మ, మదర్ థెరిసా, స్వామీ రంగనాథానంద,



స్వామీ బోధస్వరూపానంద వంటి ఆధ్యాత్మిక వేత్తలు, బిల్లీ గ్రాహం, మైఖేల్ ఎ. విండీ, డా. డైక్మన్, శ్రీ జాన్ డేవిడ్ వంటి విదేశీ కారుణ్యమూర్తులు, అనేక దేశీయ, అంతర్జాతీయ సంస్థలకు చెందిన వేలాది కార్యకర్తలు, లయన్స్, రోటరీ వంటి అంతర్జాతీయ సంస్థలు.. ఒకరేమిటి, ఎందరో ఈ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. వారందరితోనూ స్థానిక ఉప్పెన బాధితులు చేదోడువాదోడుగా నిలిచి తోడ్పాటు అందించారు.

తీరం పొడవునా శాశ్వత తుపాను సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో వచ్చే తుపాన్లకు తట్టుకునేలా వేలాది పక్కా ఇళ్లను నిర్మించారు. కాలనీలకు కొత్తగా పేర్లతో కాలనీలు వెలిశాయి. అనేకమంది సేవామూర్తుల పేర్లను ఆయా కాలనీలకు పెట్టి, వారి సేవలకు దివిసీమ వాసులు కృతజ్ఞత తెలిపారు.

ప్రభుత్వం చాలా నిర్మాణాత్మకంగా వ్యవహరించటం వలన లక్షలాది రూపాయల నిధుల్ని శాశ్వత పునరావాస కార్యక్రమాలకు వెచ్చించటం జరిగింది. కొన్నేళ్ళయిన తరువాత తాము నిర్మించిన కాలనీల పరిస్థితి ఎలా ఉందో పరిశీలించటానికి వచ్చిన దాతలు కొందరు మరికొంత అదనపు సాయాన్ని అందించిన సందర్భాలు కూడా ఉన్నాయి.



విపత్తులో మునిగిన నేలపైన ఆశల అంకురం పూసింది. మండలి వారి ఆలోచనతో పునర్నిర్మాణాకి సంసిద్ధ మయ్యింది దివిసీమ. సేవా చేతులు మంగళారతులు అద్దాయి! సేవాసంస్థలు ఆర్తుల గుండె తడిమి భుజం తట్టాయి.

సహకారం ఒక పదం కాదు, ఒక సామూహిక గానం ఆనాడు! ఉప్పెన గుణపాఠం మానవతా మంత్రంగా మారింది. సేవా ప్రపంచం చేతులు కలపటంతో కన్నీటిని చెమటగా మార్చుకున్నారు దివి ప్రజలు. ఉప్పెనలో మరణించిన వారంతా దివిఅమరులు కాగా, జీవించి పునర్నిర్మాతలుగా ఎదిగినవారంతా దివిదీపాలు!